Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 09.03.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 40 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## జగన్ జోరు.. బాబు బేజారు



- తప్పని పరిస్థితుల్లో టీడీపీ కేంద్రమంత్రుల రాజీనామా
- ప్రతిగా తమ పదవులు వదులుకున్న బీజేపీ రాష్ట్ర మంత్రులు
- అయినా కూడా ఇంకా కొనసాగుతున్న బంధం

'మన్మధుడు' సినిమాలో సీన్ ఇది... బ్రహ్మానందం ఇంటికి నాగార్జున, సోనాలిబింద్రే వస్తారు. అక్కడ బ్రహ్మానందం భార్యగా ఒక నల్లజాతి మహిళ ఉండడాన్ని చూసి మీది లవ్ మ్యారేజీనా అని నాగార్జున అడుగుతాడు. దానికి బ్రహ్మానందం... ముందు ఆమె నన్ను ప్రేమించింది... తర్వాత నేను ప్రేమించాల్సి వచ్చింది అంటాడు. ఇదే సీన్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలలో చోటుచేసుకుంది. కేంద్రంలోని బీజేపీ వాళ్ళు చంద్రబాబును దూరంగా వుంచారు. దాంతో ఆయన వారికి దూరం కావాల్సివచ్చింది.

"అత్త కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు..." అనే పాత సామెత అందరికీ తెలిసిందే! కేంద్ర కేబినెట్ నుండి తెలుగుదేశం మంత్రులు అశోక గజపతిరాజు, సుజనాచౌదరిలు బయటకొచ్చేసారు. వారు తమ పదవులకు రాజీనామాలు చేసారు. ఏపి విషయంలో కేంద్ర వైఖరిని నిరసిస్తూ చంద్రబాబు కేంద్ర కేబినెట్ నుండి వైదొలగాలని నిర్ణయించుకున్నారు. దీంతో రాష్ట్ర బీజేపీ కూడా రాష్ట్ర కేబినెట్ నుండి వైదొలగాలని నిర్ణయించుకుంది. ఆ పార్టీ మంత్రులు కామినేని శ్రీనివాస్, మాణిక్యాల రావు కేంద్రమంత్రుల కంటే ముందే తమ పదవులకు రాజీనామాలు చేసేసారు.

చంద్రబాబు ఇంత సడెన్‌గా ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి కారణం జగన్! ప్రత్యేకహోదా ఉద్యమాన్ని అతను ఉధృతం చేసాడు. ప్రత్యేకహోదా కోసం పోరాడుతున్నది జగనేనని, ఈ విషయంలో చంద్రబాబు, ఆయన ఎంపీలు (మిగతా 11వ పేజీలో)

• ప్రత్యేకపోరులో...

## వైకాపాదే పైచేయి!



ప్రత్యేకహోదా పోరును పట్టాలెక్కించడంలో వైకాపా అధినేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నాడనిపిస్తోంది. రాష్ట్రంలోనే కాదు, కేంద్రంలోనూ ప్రత్యేకహోదా ఉద్యమాన్ని వేడెక్కించాడు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తొలిసారిగా ఏపికి జరిగిన అన్యాయాన్ని ఢిల్లీ వీధుల్లోనూ తెలిసేలా చేయగలిగాడు. జాతీయ స్థాయిలో అన్ని పార్టీలు ప్రత్యేకహోదా ఉద్యమంపై, ఏపికి జరిగిన అన్యాయంపై చర్చించే స్థాయికి తీసుకొచ్చాడు.

అడ్డగోలు విభజన ద్వారా కాంగ్రెస్‌పార్టీ ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేస్తే, తాము అధికారంలోకి వస్తే ఏపికి పదేళ్ళపాటు ప్రత్యేకహోదాను అమలు చేస్తామన్న నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక కాంగ్రెస్ కంటే (మిగతా 11వ పేజీలో)

• రాజకీయ ప్రయాణంలో...

## ఇది తొలి సంతకం

### వైకాపా రాజ్యసభ అభ్యర్థిగా విపిఆర్ నామినేషన్



ఇప్పటికే నెల్లూరు కేంద్రంగా నెల్లూరుజిల్లాలోనే కాక రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఆధ్యాత్మిక, మానవీయ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మనసుల్లో సేవాస్వాప్నికుడిగా ముద్రపడ్డ ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి... తన జీవితంలో మరో సేవా ప్రయాణానికి తొలి సంతకం చేసారు. ఇంతదాకా వ్యక్తిగా, సేవాశక్తిగా సమాజానికి తనవంతు సేవలందిస్తూ వచ్చిన ఆయన ఇక నుండి రాజకీయ కోణంలోనూ సేవలందించనున్నారు.

(మిగతా 11వ పేజీలో)



స్వర్గీయ శ్రీమతి ఆలూరు సుజాత
కోవూరు (మరణం : 10-03-2015)

## తృతీయ వర్ధంతి

మమతల మణిదీపం, అమృతమూర్తి **శ్రీమతి ఆలూరు సుజాత** గారు మాకు దూరమై మూడు సంవత్సరాలు గడిచాయి. వారు మాపై చూపిన ఆత్మీయానురాగాలు మేము ఎన్నటికీ మరువలేము. వారి జ్ఞాపకాలు మా హృదయాలలో పదిలంగా వుంటాయి. వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ... తృతీయ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకొంటున్నాము.

భర్త : ఆలూరు శ్రీనివాసులు రెడ్డి

కుమారులు - కోడళ్లు :
ఆలూరు ప్రదీప్‌రెడ్డి - సుష్మ,
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి - రూప
మనుమలు, మనుమరాండ్రు,

మరిది - చెల్లెలు:
ఆలూరు అనిల్‌కుమార్‌రెడ్డి - శోభన
కుమార్తె : డా॥ సుస్మిత - పిడతల భాస్కర్‌రెడ్డి
కుమారుడు : ఆలూరు శ్రీకాంత్‌రెడ్డి - సాహితి

వర్ష, క్రిష్ణశ్రిత, యువన్, అమన్, శియ, నేహ, నిత్య మరియు కుటుంబసభ్యులు

# ఈ ఇళ్ళ సముదాయాలు భేష్!

## - గోవా మంత్రి ప్రశంస



నెల్లూరులోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్ళ సముదాయాల్ని గోవా గృహనిర్మాణశాఖ మంత్రి జయేష్ సాల్గాంకర్ ఈ నెల 3న పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గోవాలో కూడా ఇలాంటి ఇళ్ళే నిర్మించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. గోవాలో భూమి లభ్యత తక్కువగా ఉన్నందువల్ల ఆర్థికంగా వెనుకబడిన ప్రజల కోసం ఇలాంటి జి ప్లస్ త్రీ తరహా అపార్ట్‌మెంట్లను నెలకొల్పేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ గృహ సముదాయాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనాలని అంటూ, ఇలాంటి ఇళ్ళను నిర్మించేందుకు చొరవచూపిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును, మునిసిపల్ మంత్రి డా.పి. నారాయణ కృషిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీమతి హరిత తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన రేటు... రైతుకు పోటు

## దళారుల దందా... మిల్లర్ల సిండికేట్...



నాలుగు పుట్ల ధాన్యం పండించాలంటే ఒక ఎకరాలో సేద్యం చేయాలి. దుక్కిదున్నే దగ్గర నుండి నారు ఏతలు మొదలుకొని నీళ్ళు, కరెంట్, ఎరువులు, పురుగుమందులు, కలుపు కూలీలు, చివరికి కోతల వరకు ఎట్లా లేదన్నా ఎకరాకు 25 నుండి 30వేల పెట్టుబడి అవుతుంది. దిగుబడికి కనీసం నాలుగు నెలలు పడుతుంది. ఈ నాలుగు నెలల్లో పెట్టుబడి ఒకెత్తయితే, పంటను కంటికి రెప్పలా కాపాడుకోవడం ఒకెత్తు. అకాల వర్షాల నుండి, ఈదురుగాలుల నుండి, చీడ, పీడల నుండి, సాగునీటి కొరత నుండి పైరును పసిబిడ్డలా కాపాడుకుని గట్టెక్కించాలి. ఇక్కడ రైతు పెట్టుబడితో పాటు అతని శ్రమ, అతని రిస్క్... అతని టెన్షన్... ఇన్ని కలిస్తేనే ఎకరాకు నాలుగు పుట్లు. అది కూడా బాగా వచ్చిందంటే! ఇప్పుడున్న ధరల ప్రకారమైతే పుట్టికి 15వేలు వేసుకున్నా ఎకరాకు 60వేలు చేతికొస్తుంది. పెట్టుబడి, దానికి వడ్డీలు తీసేస్తే రైతుకు మిగిలేది అంతంతమాత్రం. అంటే 4నెలల కాలంలో అతను పెట్టుబడి పెట్టి, శ్రమపడి సంపాదించినదానికంటే కూడా కేవలం రోజులతేడాలో దళారులు, మిల్లర్లు పెద్దగా శ్రమ లేకుండానే ధాన్యం కొనుగోలు ద్వారా ఎక్కువ సంపాదిస్తున్నారు. రైతు శ్రమతో రైతుల రిస్క్‌తో మిగతావాళ్ళంతా వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం 15,500రూపాయలు మద్దతు ధర ప్రకటించింది. గత ఏడాది ఇదే సీజన్‌లో పుట్టి ధర 17వేల నుండి 20వేల దాకా పలికింది. ఈ ఏడాది రేట్లు బాగా తగ్గిపోయాయి. ఎకరా మీద రైతుకు పెట్టుబడి వ్యయం పెరగగా రాబడికి బాగా కోతపడింది. ధాన్యం నిల్వ చేసుకోవడానికి జిల్లాలో తగినన్ని గోడౌన్‌లు లేవు. దీంతో రైతులు చచ్చినట్లు వచ్చిన ధరకు పంటను అమ్ముకోవాల్సిందే! రైతుల చేతుల నుండి ధాన్యం పూర్తిగా వెళ్ళిపోయాక అప్పుడు రేట్లు పెరుగుతాయి. రైతు అన్యాయమైతేనే కదా మిగతా వాళ్ళకు ఆదాయాలొచ్చేది!

# బిరబిర ఆరులైన్ల పనులు

ప్రయాణంలో నరకానికి నమూనాగా మారిన నాయుడుపేట-పూతలపట్టు రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2019కల్లా దీనిని ఆరులైన్లుగా విస్తరించాలన్నది లక్ష్యం. రాష్ట్రంలోనే ప్రధానంగా విస్తరించాల్సిన రహదారి ఇది. మూడు రాష్ట్రాలకు, మూడు రాష్ట్రాలలోని ప్రధాన పుణ్యక్షేత్రాలకు ప్రధాన నగరాలకు అనుసంధానమైన రహదారి ఇది. నిత్యం వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత ఎన్డీఏ ప్రభుత్వంలో దేశ వ్యాప్తంగా జాతీయ రహదారుల విస్తరణను చేపట్టినప్పుడే నాయుడుపేట, పూతలపట్టు రహదారి విస్తరణ చేపట్టి వుండాల్సింది. అలా చేసుంటే ఎన్నో ప్రమాదాలను తగ్గించి, ఎన్నో ప్రాణాలను కాపాడిన వాళ్ళై వుండేవారు. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఈ రహదారితో పాటు కృష్ణపట్నం-బళ్లారి రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ఈ దిశగా అడుగులు వేస్తుండగానే ఆయన మరణించారు. ఆ తర్వాత ఈ రహదారులను ఏ సీఎం పట్టించుకోలేదు. ఎట్టకేలకు నాయుడుపేట-పూతలపట్టు రహదారిని జాతీయ రహదారుల్లో కలిపి దీనిని ఆరులైన్లుగా మార్చడానికి కేంద్రం నిర్ణయించడం శుభపరిణామమే! రోడ్డు విస్తరణకు సంబంధించిన సర్వే, భూసేకరణ పనులు ఊపందుకున్నట్లు తెలుస్తోంది.

## ఉత్తరక్రియలు



మా తల్లి గారు

**శ్రీమతి డేగా సీతారామమ్మ**

తే.05.03.2018ది, సోమవారం స్వర్గస్తురాలైనారు.

**వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...**

కుమారులు:

**డేగా మోహన్‌రెడ్డి**
**డేగా నరసారెడ్డి**
**డేగా శ్రీనివాసులురెడ్డి**
**డేగా సుధాకర్‌రెడ్డి**

కుమార్తె :

**డేగా ప్రసీద**

**పెద్దకర్మ: తే.15.03.2018ది గురువారం**
**1వ మెయిన్‌రోడ్డు, రామ్మూర్తినగర్, నెల్లూరులోని**
**మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.**

సోమిరెడ్డి కృషితో...

# నెల్లూరులో రీజనల్ ఇన్నోవేటివ్ సెంటర్

## - పరిశీలనలో ఫిలిప్పైన్స్ శాస్త్రవేత్తలు



రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల ఫిలిప్పైన్స్, వియత్నాం, థాయిలాండ్ దేశాల్లో పర్యటించి వచ్చిన నేపథ్యంలో, ఫిలిప్పైన్స్ కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఇ్రి) డైరెక్టర్ జనరల్ మాథ్యూమోరెల్ సారధ్యంలోని శాస్త్రవేత్తల బృందం ఈ నెల 3న నెల్లూరుజిల్లాలో పర్యటించింది. రాష్ట్రంలో రీజనల్ ఇన్నోవేటివ్ సెంటర్‌ను ఏర్పాటుచేసేందుకు ఈ బృందం కృషిచేస్తోంది. ప్రస్తుతం ఇలాంటి కేంద్రం ఉత్తరభారతదేశంలో వారణాశిలో ఉంది. రెండవ కేంద్రంగా ఈ ఇన్నొవేటివ్ సెంటర్‌ను ఇ్రి భాగస్వామ్యంతో నెల్లూరుజిల్లాలో ఏర్పాటుచేసేందుకు ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఈ బృందం విచ్చేసింది. ఈ సందర్భంగా ఆ బృందం వారు జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, ఏసిఐఐసి ఛైర్మెన్ పి.కృష్ణయ్య, ఆచార్య ఎన్జీరంగా విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్ వి.దామోదరనాయుడు, ఆర్డీఓ పి.హరిత, ఏపిఐఐసి జడ్‌ఎం కె. వెంకటేశ్వరరావు, డిడిఏ శివనారాయణ తదితరులతో సమావేశమయ్యారు. అనంతరం రీజనల్ ఇన్నొవేటివ్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలమైన భూములను ఫిలిప్పైన్స్ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. తొలుత కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాడు భూములను, ఆ తర్వాత ముత్తుకూరు మండలంలోని నారికేళ్ళపల్లి పంచాయతీలోని భూములను పరిశీలించారు. అక్కడ రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించి దిగుబడులపై చర్చించారు. ఆ తర్వాత నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన క్షేత్రం(ఏఆర్ఎస్) సందర్శించారు. నెల్లూరు శాస్త్రవేత్తలు సృష్టిస్తున్న వంగడాల విశిష్టతను తెలుసుకున్నారు. ఆ తర్వాత ఇ్రి శాస్త్రవేత్తలను దామోదర్‌నాయుడు ఘనంగా సత్కరించారు. రీజనల్ ఇన్నొవేటివ్ సెంటర్ ద్వారా దీర్ఘకాలం మనుగడలో ఉండే వరి వంగడాలను సృష్టిస్తారు. వాతావరణంలో చోటుచేసుకునే అనూహ్యామార్పులను తట్టుకోవడంతో పాటు స్థిరమైన దిగుబడులు ఇచ్చే వంగడాలను సృష్టించడం ఈ కేంద్రం ప్రత్యేకత. ఆ వంగడాల వల్ల దిగుబడి 25 శాతం అధికంగా ఉంటుంది. ఇలాంటి ఎన్నో విశిష్టతలున్న రీజనల్ ఇన్నొవేటివ్ సెంటర్‌ను వరిసాగుకు పుట్టినిల్లయిన నెల్లూరులో ఏర్పాటు చేసేందుకు మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కృషి చేస్తుండడం విశేషం. ఈ శాస్త్రవేత్తల బృందంలో డైరెక్టర్‌జనరల్ డా. మాథ్యూమోరల్‌తో పాటు డాక్టర్ నఫీస్ మెహ్, డా. అరవిందకుమార్, ఆ. ఆల్డాస్ జానయ్య, డా. వికాస్‌కుమార్‌సింగ్, రూబినా నిషాత్ ఉన్నారు. శాస్త్రవేత్తల బృందం పర్యటన ఏర్పాట్లను వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓయస్డీ సడ్డా ప్రసాదరావు పర్యవేక్షించారు.

# గోవిందరాజు సీతాదేవి సాహిత్య పురస్కారం 10న!

ప్రముఖ రచయిత్రి గోవిందరాజు సీతాదేవి సాహిత్య పురస్కారం-2017ను ఈ నెల 10వ తేది ఉదయం 9 గంటలకు నెల్లూరులోని ఇండియన్ మెడికల్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పలువురు లబ్ధప్రతిష్టులైన కవులు, రచయితలకు ప్రదానం చేయనున్నామని పురస్కార కమిటీ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి తెలియజేశారు. ఉత్తమ నవల 'ఆయుధం' రచయిత టిఎస్ఏ కృష్ణమూర్తి, 'రేలపూలు' కథాసంపుటి రచయిత్రి సమ్మెట ఉమాదేవి, 'తడి ఆరని దు:ఖం' కవితా సంపుటి రచయిత్రి భండారు విజయలకు ఈ పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. ఇదే సందర్భంలో ప్రముఖ కథారచయిత పోట్లూరు సుబ్రహ్మణ్యంకు ఆత్మీయ సన్మానం నిర్వహిస్తామని, సభకు పురస్కార కమిటీ కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జేసి ఏఎండి ఇంతియాజ్, వియస్‌యు వీసీ వీరయ్య, మంత్రి నారాయణ ఓయస్డీ సిహెచ్ పెంచలరెడ్డి, తెలుగు రక్షణవేదిక జాతీయ అధ్యక్షుడు పోట్లూరి హరికృష్ణ, ప్రముఖ కవులు శ్రీ సాగర్ శ్రీరామకవచం, డా.రాధేయ, వెంకటకృష్ణ, పురస్కార కమిటీ ఉపాధ్యక్షుడు గోవిందరాజు సుధాకర్ తదితరులు పాల్గొంటారని, కవులు కవయిత్రులు రచయితలు సాహిత్యాభిమానులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# నగరంలో టెన్షన్... టెన్షన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని అరెస్ట్ చేస్తారనే వార్తలతో నెల్లూరు నగరంలో 8వ తేదీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైకాపా కార్యకర్తలు, శ్రీధర్‌రెడ్డి అనుచరులు, అభిమానులు 8వ తేదీ ఉదయమే నెల్లూరు దర్గామిట్టలోని శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి భారీగా చేరుకున్నారు. శ్రీధర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తే ఆందోళన చేపట్టాలని పార్టీ కార్యకర్తలు నిర్ణయించారు.

ఇంత టెన్షన్‌కు దారితీసిన పరిస్థితులకు కారణం బెట్టింగ్ కేసు. 2017 ఆగస్టులో క్రికెట్ బెట్టింగ్ కేసు జిల్లాలో సంచలనం రేపడం తెలిసిందే! 115మంది బుకీలను, పంటర్లను ఈ కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ క్రమంలో బెట్టింగ్ ముఠాకు ఎవరెవరితో సంబంధాలున్నాయనేదానిపై విచారించి, బెట్టింగ్ ముఠాతో నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు సంబంధాలున్నాయని అనుమానిస్తూ వారిని ఒకటికి రెండుసార్లు విచారణకు పిలిచారు. వాళ్ళు రెండుసార్లు వెళ్ళి బెట్టింగ్ ముఠాకు తమకు ఎలాంటి సంబంధాలు లేవని చెప్పి వచ్చారు. అయితే ఈ కేసు ఇలా వుండగానే 2017 మార్చిలో నమోదైన ఓ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలంటూ పోలీసులు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నోటీసు జారీ చేయడంతో మళ్ళీ వివాదం రాజుకుంది. 7వ తేదీ ఉదయం 7.50గంటల ప్రాంతంలో పోలీసులు శ్రీధర్‌రెడ్డి ఇంటికి వెళ్ళి 2017 మార్చిలో రెండో నగర పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలంటూ నోటీసు ఇచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మండిపడ్డాడు. ఉదయం 7.30గంటలకు విచారణకు హాజరుకావాలంటూ 7.50 గంటలకు నోటీసులు తేవడం ఏంటంటూ ఆగ్రహించారు. దీంతో పోలీసులు 8వ తేదీ ఉదయం 9గంటలకు విచారణకు రావాలంటూ రెండో నోటీసు తెచ్చిచ్చారు. అయితే శ్రీధర్‌రెడ్డి 8వ తేదీ విచారణకు హాజరు కాలేదు. తన కార్యాలయంలోనే కూర్చున్నారు. ఆయనకు మద్దతుగా వేలాదిమంది కార్యకర్తలు గుమికూడారు. విచారణకు హాజరయ్యేది లేదు, పోలీసులు వచ్చి అరెస్ట్ చేసుకుంటే చేసుకోనీయండి... రాజకీయ కక్షతోనే నన్ను కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్ళకు బెదిరేది లేదు. మంత్రి నారాయణ అజెండా ప్రకారం జిల్లా ఎస్పీ పని చేస్తున్నారు. క్రికెట్ బుకీల నుండి మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, పోలీసు అధికారులకు ఫోన్లు వెళ్ళాయి. వాళ్ళందరూ బెట్టింగ్ ఆడినట్లేనా? కేవలం అధికార పార్టీ ఒత్తిళ్ళకు లొంగి ఎస్పీ ఈ పని చేస్తున్నారు. ఆయన ఖాకీ చొక్కా వదిలి పసుపు చొక్కా వేసుకుంటే మంచిదంటూ కోటంరెడ్డి నిప్పులు చెరుగుతున్నాడు. 8వ తేదీ సాయంత్రం వరకు నగరంలో ఎలాంటి పరిణామాలు లేవు. తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయో చూడాలి?

# తెలుగు జాతికి తీరని ద్రోహం

## - డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య



కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ఏపిలోని తెలుగు దేశం ప్రభుత్వం తెలుగు ప్రజలకు తీరని ద్రోహం చేసాయని నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య ఆరోపించారు. ఈ నెల 6వ తేదీన ప్రత్యేకహోదా డిమాండ్‌తో ఢిల్లీలోని సంసద్ రోడ్డులో చేపట్టిన కాంగ్రెస్ ఆత్మగౌరవ దీక్షా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాతో పాటు విభజన చట్టంలోని హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నెల్లూరుజిల్లాలోని దుగరాజపట్నం పోర్టును వెంటనే ప్రారంభించాలని కోరారు. ప్రత్యేకహోదా ఇచ్చేవరకు కేంద్రంపై కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ దీక్షలో నెల్లూరుజిల్లా నాయకులు పి.చెంచలబాబుయాదవ్, ఉడతా వెంకట్రావ్, శ్రీహరి, సుమంత్, గలాజు శివాచారి, కేశవ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గుక్కెడు నీళ్ళివ్వటమే లక్ష్యం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్, ముస్లిం పెద్దలు

నెల్లూరు నగరంలోని 43వ డివిజన్ జెండావీధి పిఎన్‌ఎం మునిపిపల్ హైస్కూల్‌లో తన సొంతనిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేసి నగర ఎమ్మెల్యే అనిల్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు తన వంతు కర్తవ్యంగా వాటర్‌ప్లాంట్ నెలకొల్పి దానికి 'అబ్దుల్ కలాం వాటర్‌ప్లాంట్' అని నామకరణం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ వాటర్‌ప్లాంట్‌ను ఈనెల 7న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.అనిల్ మాట్లాడుతూ, 43వ డివిజన్‌లో త్రాగునీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలెన్నో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెప్పడంతో, కార్పొరేటర్ ఎండి ఖలీల్‌అహ్మద్ సూచనతో ఈ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఖలీల్‌అహ్మద్, అతహర్‌బాషా, మున్వర్, మీరామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## తిరువయ్యార్‌ను తలపిస్తున్న...

# త్యాగరాజ స్మరణోత్సవాలు

- నెల్లూరులో వీనులవిందుగా.. సంగీత పండుగ
- తొలిరోజు సభకు విచ్చేసిన డా. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



కారుణ్యను సత్కరిస్తున్న ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం

భక్తి జ్ఞాన గానంలో ప్రసిద్ధులైన ఎందరో సంగీతజ్ఞులు నెల్లూరు నగరంలో ఎంతో వేడుకగా జరుగుతున్న 53వ భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాల్లో పాల్గొని అత్యద్భుతమైన గళాలతో తమ గానాన్ని, సంగీత జ్ఞానాన్ని శ్రోతలకు శ్రవణపేయంగా వినిపిస్తుంటే..శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు తిరువయ్యార్‌ను తలపిస్తున్నాయా అనిపిస్తోంది. వారి మనోహర గానాలతో పురమందిర ప్రాంగణం పులకించిపోతోంది. శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలను ఒక సంగీత పండుగలా నిర్వహిస్తూ నెల్లూరును మరో తిరువయ్యార్‌గా ప్రసిద్ధిలోకి తెచ్చిన మహనీయులు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారు. తన ప్రియమిత్రుడైన శ్రీ యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రి గారి సహకారంతో ఈ అపురూపమైన కార్యక్రమాలకు రూపుదిద్దారు. వీరి సంకల్పబలం ఎంత ఘనమైనదో, ఎంత పవిత్రమైనదో, ఎంతటి మహనీయమైనదో ఇప్పుడు నెల్లూరు పురమందిర ప్రాంగణంలో మనం నిత్యం చూస్తున్న, వింటున్న ఆ మధురభక్తి గానాలు వింటే చాలు.. తెలుస్తుంది. శ్రీ సాంబమూర్తిగారు, శ్రీ వేంకటేశ్వరశాస్త్రి గారు గతించిపోయినా వారి స్ఫూర్తి మనకు నేటికీ భక్తిజ్ఞానకాంతులను అందిస్తూనే ఉంది. వారు మనకు మిగిలించిన ఆ రాగసుధామృతధార మనలను భక్తిభావ సమ్మోహితులను చేస్తూనే ఉంది. భారతీయ సంస్కృతిలో భాగమైన ఆ ఆధ్యాత్మిక భావ పరంపరను ఆ తరం నుంచి ఈ తరానికి మోసుకువచ్చి మనల్ని ఆనందపరవశుల్ని చేస్తూనే ఉంది. 'నిధి చాల సుఖమా.. రాముని సన్నిధి సుఖమా', 'శాంతము లేక సౌఖ్యము లేదు', మోక్షము గలదా భువిలో జీవన్ముక్తులు గాని వారలకు', 'ఎందరో మహానుభావులు.. అందరికీ వందనములు'.. అంటూ పలు ప్రసిద్ధగీతాలతో ప్రఖ్యాతమైన శ్రీ త్యాగరాజస్వామివారిని నిత్యం నిండు మనసుతో తలచుకుంటూ, ఆ స్వామి కృతులను నోరారా పాడుకుంటూ నెల్లూరులో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధకులు జోలెకట్టి భిక్షాటన చేసి మరీ ఈ అద్భుతమైన కార్యక్రమాలను ఒక పరంపరగా మనకందజేస్తున్నారు. ఈ నెల 6 నుంచి 13వ తేది దాకా జరుగుతున్న ఈ కార్యక్రమాల్లో తొలిరోజు ప్రారంభోత్సవానికి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి తనయుడు, విఖ్యాత గాయకుడు పద్మభూషణ్ డా. ఎస్పి బాలసుబ్రహ్మణ్యం విచ్చేసి ఈ ఉత్సవాలకు మరింత ఉత్సాహాన్ని తెచ్చారు. శ్రీ త్యాగరాజస్వామి స్మరణోత్సవ సభకు ఆయన శాశ్వత అధ్యక్షుడు కూడా. అదేవిధంగా శ్రీ యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రి కుమారుడు శ్రీ నాగదేవిప్రసాద్‌తో పాటు స్మరణోత్సవ సభ కమిటీ, త్యాగరాజస్వామి ఆరాధకులు అందరూ కలిసి ఈ సంగీతయజ్ఞాన్ని ప్రతిఏటా నిర్విఘ్నంగా నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ సంగీతోత్స వాల్లో తొలిరోజు అత్యద్భుతమైన తన గానాన్ని వినిపించి అందరి కరతాళధ్వనులందుకున్న ప్రముఖ సంగీత విద్వాంసుడు ఎస్‌సి కారుణ్య (హైదరాబాద్)ను డా. ఎస్పి బాలసుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాలూ మాట్లాడుతూ, తన తండ్రి ప్రారంభించిన ఈ సంగీత పండుగ 53 ఏళ్ళుగా కొనసాగుతుండడం తనకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ఈ వేడుక ఇంత ఘనంగా నిర్వహించడం వెనుక యనమండ్ర నాగదేవిప్రసాద్ కృషి ఎంతైనా ఉందన్నారు. ఈ స్మరణోత్సవాల సభకు తను శాశ్వత అధ్యక్షుడినైనప్పటికీ, తాను ఈ వేడుకల్లో ఒక సంగీత సేవకునిగా మాత్రమే పాల్గొంటున్నానని తెలిపారు. కాగా, ఈ నెల 13వ తేది వరకు అనేకానేక సంగీత కార్యక్రమాలు, వాద్య కచ్చేరీలు, హరికథాగానాలు వగైరాలెన్నో నిర్వహిస్తున్నారు. ఆయా రంగాల్లో ప్రముఖులైన సంగీతవిద్వాంసులు కుమారి కలకత్తా శ్రీవిద్య, డా. చేర్లపల్లి రంగనాధశర్మ, శ్రీమతి రంజనీ శివకుమార్, శ్రీ విఘ్నేష్ ఈశ్వర్, అర్చన–ఆరతి సిస్టర్స్‌తో పాటు ప్రముఖ కీబోర్డు కళాకారుడు కె. సత్యనారాయణ (చెన్నై) ఈ సంగీతోత్సవాల్లో తమ కళాప్రతిభను చాటుతున్నారు.

***13న 'జీవన దర్శనం' పుస్తకావిష్కరణ :***

ఆద్యంతం అద్భుతంగా నిర్వహించే ఈ సంగీత పండుగ చివరి రోజున 13వ తేది సాయంత్రం 6.30 గంటలకు హరికథా భిక్షువు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి అయ్యవారి గురించి ప్రముఖ రచయిత ఎమ్మెస్ సూర్యనారాయణ రచించిన 'జీవన దర్శనం' పుస్తకావిష్కరణ జరుగుతుంది. సాంబమూర్తిగారి సతీమణి, బాలూగారి మాతృమూర్తి శ్రీమతి శ్రీపతి పండితారాధ్యుల శకుంతలమ్మ ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. విఖ్యాత గాయకులు డా.ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నిర్వహణలో జరిగే ఈ సభలో ప్రముఖ సినీకవులు సిరివెన్నెల సీతారామశాస్త్రి, తనికెళ్ళ భరణి, వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త కోడూరు ఈశ్వరవరప్రసాద్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ సారధులు గ్రోసు గోపాలయ్య, వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొంటారు. అనంతరం, ప్రవచన చక్రవర్తి, సరస్వతీ జ్ఞానపుత్ర బిరుదాంకితులైన బ్రహ్మశ్రీ డా. చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఉంటుంది. సంగీతాభిమానులు, భక్తులు, సింహపురి ప్రజలందరూ ఈ కార్యక్రమాలకు తరలివచ్చి ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగే శ్రీ త్యాగరాజస్వామి స్మరణోత్సవాలను తిలకించి తరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రమా చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీబొమ్మ సెంటర్ వద్దనున్న రమా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ గాయత్రి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న పవిత్రకు రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రక్షణశాఖ ముఖ్య సలహాదారుడు, డిఆర్‌డిఓ డైరెక్టర్ జనరల్ గుండ్ర సతీష్‌రెడ్డి సతీమణి గుండ్ర పద్మావతి పాల్గొని చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మెన్ పున్నేపల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దాతలు, జేసి ఇంతియాజ్ అహ్మద్ తదితరుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు సభ్యులు కందుకూరు జనార్ధన్, గజల్ నాగరాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# ఈశాన్యాన్ని ఆక్రమించారు!

**తాజాగా ఈశాన్య భారతంలోని త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో జరిగిన ఎన్నికల్లో బిజెపి విజయపథంలో దూసుకుపోయింది. త్రిపురలో కమ్యూనిస్టుల కంచుకోట కూలిపోయింది. దీంతో, బిజెపి సైద్ధాంతికంగా కమ్యూనిస్టులపై ఘనవిజయం సాధించినట్లయింది. ఒక్కమాటలో చెప్పాలంటే త్రిపురలో బిజెపి శూన్యం నుంచి శిఖరస్థాయికి ఎదిగింది. ఇదంతా ప్రజల నుంచి వచ్చిన మార్పే. కాలం చెల్లిన సిద్ధాంతాలతో కమ్యూనిస్టుల ఉనికి పశ్నార్థకంగా మారుతోంది.**

త్రిపురలో కమలం విరిసింది. బిజెపిలో ఆనందం వెల్లివిరిసింది. కమ్యూనిస్టు (మార్క్సిస్టులు)ల కోటగా ఉన్న ఈ రాష్ట్రంలో ఎవరూ ఊహించని రీతిలో కమల పతాకం రెపరెపలాడింది. త్రిపుర అంటే కమ్యూనిస్టులకు పెట్టిన కోట. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా అక్కడ కమ్యూనిస్టులు అప్రతిహతంగా రాజ్యమేలుతున్నారు. అయినా, ప్రజల తీర్పు ఈసారి బిజెపినే వరించింది. ఇన్నేళ్ళు పాలించినా ప్రజల ఆశలు ఆకాంక్షలు ఫలించకపోవడంతో విసిగి వేసారి తాజాగా జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టుల పాలనకు తెరదించారు. నూతనోత్తేజంతో అక్కడి ప్రజలు బిజెపిని స్వాగతించారు. బిజెపి తన భాగస్వామి పక్షమైన ఐపిఎఫ్‌టితో కలసి మూడింట రెండువంతులకు పైగానే ఆధిక్యాన్ని సాధించి తన సత్తా చాటుకుంది. అయిదేళ్ళ క్రితం ఇక్కడ జరిగిన ఎన్నికల్లో కేవలం రెండుశాతం కన్నా కూడా తక్కువ ఓట్లు దక్కించుకున్న బిజెపి, ఇప్పుడు చరిత్ర తిరగరాసింది. తనకు తిరుగేలేదనిపించింది. త్రిపురలో ఎన్నికలు జరిగిన 59 స్థానాల్లో ఏకంగా 43 స్థానాలు బిజెపి కూటమికి లభించడం తిరుగులేని రికార్డు. విజయానికి అవసరమైన స్థానాలకంటే అధికంగా 35 స్థానాలు గెలుచుకోవడమంటే చిన్నవిషయమేమీ కాదు. అందులోనూ ఇక్కడ అప్పటిదాకా ఉన్న ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ అంటే నిజంగా రాజకీయ రంగంలో మాణిక్యమే.. ఓ మేలిమి ఆణిముత్యమే. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ వామపక్షాల చరిత్ర లోనే మాణిక్ సర్కార్‌ది ఒక ప్రత్యేక చరిత్ర. అంతటి నిజాయితీపరుడు.. నిరాడంబరుడాయన. అవినీతి మకిలి అంటని రాజకీయ యోధుడు. ఆయనకు ఎలాంటి ఆస్తులు, ఆడంబరాలు లేవు. అవి ఆయనకు నచ్చని విషయాలు కూడా. అటు రాజకీయంగా కానీ, వ్యక్తిగతంగా కానీ ఆయన్ను విమర్శించడానికి ఎలాంటి విషయాలూ లేని మచ్చ లేని మంచి నేత మాణిక్ సర్కార్. అయితే, ఆయన పాలనలో సగటు మనిషి బాధలు మాత్రం తీరలేదు. రాష్ట్రంలో పెరుగుతున్న పేదరికం, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, పారిశ్రామిక ప్రగతి ఆశించిన స్థాయిలో లేకపోవడం, నిరుద్యోగం ప్రబలిపోవడం వంటి సమస్యలతో త్రిపుర కుదేలైపోయింది. రాష్ట్రంలో పాలనాపరంగా ఎన్నో సమస్యలున్నా ఏళ్ళ తరబడిగా అవి తీరనే లేదు. నాయకుడు ఎంత మంచివారైనా, నిజాయితీపరుడే అయినా ప్రజలు కోరుకునేది అభివృద్ధినే కదా!... నిజాయితీగా ఉంటూనే... ప్రజల సమస్యలు తీరుస్తూ రాష్ట్రాభివృద్ధి సాధించినప్పుడే ప్రజలు ఆదరిస్తారు. కాలానుగుణంగా సిద్ధాంతాలను మార్చుకుని ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు సంకల్పించక తమ దారే తమది.. అదే గొప్పది అన్నట్లుగా మొండిగా వ్యవహరిస్తుండబట్టే వామపక్షాలు, వాటి కూటములు జనచైతన్యం వెల్లివిరుస్తున్న నేటి అధునాతన కాలంలో.. తమకు తామే పరాజయాల గుంతలు వెతుక్కుని మరీ అందులో పడుతున్నాయి. అప్పటికీ గత పాతికేళ్ళుగా కమ్యూనిస్టు కోటగానే త్రిపుర ఉండిందంటే ఎప్పటికప్పుడు ప్రజలు తమ కలలు నెరవేరుతాయనే ఆశతోనే ఇంత కాలం ఓపిక పట్టారు. అయినా, ఫలితం లేకపోయేసరికి ప్రత్యామ్నాయం వైపు మొగ్గు చూపారు. ఆ రాష్ట్రంలో ఉద్యోగాలు లేక యువత ఎన్నో బాధలు పడుతుండడం, ఉద్యోగులకు జీతాలు పెరగక ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడం వంటివన్నీ కలసివెరసి బిజెపికి కలిసివచ్చాయి. తమ ప్రభుత్వం వస్తే ఇలాంటి సమస్యలేమీ ఉండవని, అభివృద్ధిలో త్రిపురను అగ్రగామిని చేస్తామని బిజెపి వాగ్దానాలు చేయడంతో.. సరిగ్గా ఇలాంటి మార్పు కోసమే ఎదురుచూస్తున్న ప్రజానీకమంతా గుంపగుత్తగా బిజెపికి ఓట్లు వేసి కమలనాధులకు ఘన విజయం సాధించిపెట్టారు. 8 జిల్లాలు, 37 లక్షల మంది జనాభా ఉన్న చిన్న రాష్ట్రమైన త్రిపురలో కమ్యూనిస్టుల పాలనకు స్వస్తి పలికారు. కమ్యూనిస్టుల కోటగా ఉన్న పశ్చిమబెంగాల్‌లోనూ 2011లో ఇదే జరిగింది. త్రిపురలో గతంలో జరిగిన పది అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏ ఒక్కసారీ ఒక్క సీటును కూడా సాధించలేని బిజెపి ఇప్పుడు ఏకంగా రికార్డుస్థాయిలో 43 శాతం ఓట్లు సాధించిందంటే అద్భుతమే. అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేసి కమలనాధులు తమ ప్రతిభను చాటుకున్నారు. 'అభివృద్ధికి పచ్చజెండా ఊపాలంటే..ఎర్రజెండాల్ని తొలగించాలంటూ' ప్రధాని ఎన్నికల్లో చేసిన ప్రచారాలు ప్రజల్ని బాగా ప్రభావితం చేశాయి. కనుకనే, ఇంతటి విజయం ఇక్కడ లభించిందనుకోవచ్చు. దీంతో బిజెపి సైద్ధాంతికంగా కూడా కమ్యూనిస్టులపై ఘనవిజయం సాధించినట్లయింది. భిన్నధృవాలుగా ఉన్న బిజెపి-కమ్యూనిస్టుల ఎన్నికల సమరాంగణంలో ఇది బిజెపికి తిరుగులేని విజయమేనని చెప్పకతప్పదు. ఒక్క మాటలో చెప్పాలంటే త్రిపురలో బిజెపి శూన్యం నుంచి శిఖరస్థాయికి ఎదిగింది. కమ్యూనిస్టుల కోట కూలిపోయింది. ఇదంతా ప్రజల నుంచి వచ్చిన మార్పు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో కమ్యూనిస్టుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒక్క త్రిపురలోనే కాదు, నాగాలాండ్, మేఘాలయ ఎన్నికల ఫలితాలు కూడా బిజెపికి మరింత ప్రతిష్టను చేకూర్చాయి. ఈ ఎన్నికల్లో ప్రధాని మోడీ, బిజెపి సారధి అమిత్‌షాల ప్రచారాలు ప్రజల్ని బాగా ప్రభావితం చేశాయి. ఇప్పటికే అస్సాం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో పాలన చేపట్టిన బిజెపి, తాజాగా త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లోనూ తన సత్తా చాటుతోంది. త్రిపురలో మూడింట రెండువంతుల స్థానాలను తానే గెలుచుకున్న బిజెపి, నాగాలాండ్‌లో భాగస్వామ్యపక్షంతో కలసి ప్రభుత్వం ఏర్పాటుచేయనుంది. అదేవిధంగా, మేఘాలయలో కాంగ్రెస్‌కు అధికస్థానాలు వచ్చినా, అక్కడ కూడా స్థానికంగా బలంగా ఉన్న ఓ పార్టీతో కలసి బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది.

ఏదేమైనా, ఈశాన్యభారతంలో ఆయా రాష్ట్రాల ప్రజలు బిజెపి పట్ల, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ పట్ల ఎంతో అభిమానం చూపుతున్నారనేందుకు, బిజెపికి పూర్తిస్థాయిలో తమ మద్దతు ఇస్తున్నారనేందుకు ఇటీవల ఈశాన్యభారతంలో జరిగిన ఈ ఎన్నికలే తాజా నిదర్శనం. ఈ ప్రభావం రానున్న కర్నాటక, కేరళ, పశ్చిమబెంగాల్ ఎన్నికలపై కూడా తప్పకుండా ప్రభావం చూపుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# కనువిందుగా తెప్పోత్సవం



నెల్లూరులోని మూలాపేట శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం పుష్కరిణిలో ఈ నెల 4న మూలాపేట వేణుగోపాలస్వామి, నరసింహకొండ వేదగిరి లక్ష్మీనరశింహస్వామి ఉభయ దేవేరీ సమేతంగా జలవిహారం చేస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఉదయం రంగనాథుని రథోత్సవంకు విచ్చేసిన నరశింహస్వామి రాత్రి మూలాపేటలోని వేణుగోపాల స్వామితో కలిసి తెప్పోత్సవంలో భక్తుల పూజలు అందుకున్నారు. మూడు పర్యాయాలు తెప్పపై కోనేరులో విహరించారు. భక్తులు విశేషంగా పాల్గొని తెప్పోత్సవాన్ని తిలకించారు. నరసింహస్వామి దేవస్థానం ఇ.ఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాలస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్త తుమ్మల సుబ్బారెడ్డి, మేనేజర్ గిరికృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

# వేదాంత దేశికర్ తిరునక్షత్ర వేడుకలు

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయం సమీపంలో కొలువైవున్న శ్రీ వేదాంత దేశికర్ సన్నిధిలో ఈనెల 2న వేదాంత దేశికర్ 850వ తిరునక్షత్ర వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా ఆలయనిర్వాహకులు మహా సుదర్శన యాగం నిర్వహించారు. ఉదయం మహాకుంభారాధన, సుదర్శన శతకం, సుదర్శనహోమం, పూర్ణాహుతి, శాత్తుముర్రై తదితర కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. సాయంత్రం సుదర్శనాష్టకం, షోడశాయుధ స్తోత్రం, సుదర్శన గద్య పారాయణం, మహాసుదర్శన యాగం నిర్వహించారు. ఈ యాగాన్ని మేల్కోట, శ్రీరంగం, కంచి పెరుమాళ్ ఆలయాలకు చెందిన అర్చకులు నరసరాజు భట్టర్, నారాయణ భట్టర్, నరసింహ భట్టర్, రవి భట్టర్ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.




# పిచ్చివాగుడు

ప్రధాని పదవిలో ఎవరున్నా వారిని గౌరవించడం అందరి బాధ్యత. మనం విలువ ఇచ్చేది ఆ పదవిలో వున్న వ్యక్తికి కాదు, ప్రధాని పదవికి. అలాంటి పదవిలో వున్న వ్యక్తిని 'గాడు' అని సంబోధించి తెలంగాణ సిఎం కేసీఆర్ తనను తాను దిగజార్చుకున్నాడు. సభ్యత, సంస్కారం తెలియని ఇలాంటి వ్యక్తి మళ్ళీ జాతీయ రాజకీయాలను వెలగబెడతాడంట! ఇలాంటివాళ్ళు జాతీయ రాజకీయాల్లోకి వస్తే రాజకీయాలు కూడా అలాగే తయారవుతాయి.

**సూరపనేని మోహన్‌నాయుడు, నెల్లూరు.**

# ఛండాలపు మీడియా

ఆంధ్రప్రదేశ్‌లో వున్నంత ఛండాలపు మీడియా మరే రాష్ట్రంలో, మరే దేశంలో కూడా ఉండదేమో! ఈ ఛానెళ్ళన్నీ కూడా తమ సంస్థల పేర్ల ముందు తమ కులం పేరు కూడా తగిలించుకుంటే పోతుందేమో! ఏ ఛానెల్‌లో కూడా కనీస విలువలు కనిపించడం లేదు. వ్యాపార సంస్థల కంటే మీడియా సంస్థలు దారుణంగా తయారయ్యాయి. ఛానెల్స్, పత్రికలన్నీ కూడా ఏదో ఒక పార్టీకి కొమ్ముకాసేవే! ప్రజల తరపున వకల్తా పుచ్చుకుని, ప్రజల పక్షాన, ప్రజా సమస్యలపై తమ వాణిని వినిపించే మీడియా సంస్థ ఒక్కటంటే ఒక్కటీ లేకపోవడం శోచనీయం.

**– రమేష్ చెన్ను, పొద్దుటూరు.**

# కమ్యూనిష్టుల కాలం చెల్లినట్లే!

ఈ దేశంలో కమ్యూనిజం అంతరించే కాలం ఎంతో దూరంలో లేదనిపిస్తోంది. పశ్చిమబెంగాల్ కంచుకోట చేజారి పోయింది. ఇప్పుడు త్రిపురలో పాతికేళ్ళ కమ్యూనిష్టుల పాలనకు తెరపడింది. ఇక వాళ్ళున్నది కేరళలో మాత్రమే! వచ్చే ఎన్నికల తర్వాత అక్కడ కూడా కమ్యూనిష్టు పార్టీ మాయం కావచ్చు. కమ్యూనిష్టుల పిడివాదం ఈ దేశ ప్రజలకు నచ్చదు. ముఖ్యంగా హిందూ వ్యతిరేక వైఖరితో వాళ్ళు పోతుంటారు. ఈ దేశ ప్రజలకు అది నచ్చదు. వాళ్ళు తమ విధానాలను మార్చుకోరు. వాళ్ళు మారనంత వరకు వాళ్ళ తలరాత మారదు.

**సి.రాజీవి, నెల్లూరు.**

# బీదకు రాజ్యసభ సీటు ఇవ్వాలి

త్వరలో జరుగనున్న రాజ్యసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తమ అభ్యర్థిగా జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావును ఎంపిక చేయాలి. తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుండి నెల్లూరు జిల్లాకు ఒక్కసారి కూడా ఆ పార్టీ రాజ్యసభ సీటు ఇవ్వలేదు. ఈ దఫా అయినా జిల్లాకు అవకాశం ఇవ్వాలి. బీద మస్తాన్‌రావు జిల్లాలో బడుగు వర్గాలకు నాయకుడు. ఆయనకు అవకాశం కల్పిస్తే జిల్లాలోని 10 నియోజకవర్గాలలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు తెలుగుదేశంపార్టీకి తమ మద్దతు ప్రకటిస్తారు. బిఎంఆర్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సొంత నిధులు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న పేదల మనిషి బిఎంఆర్. అటువంటి మంచి నాయకునికి రాజ్యసభ సీటు ఇచ్చి ఆయనను రాజ్యసభకు పంపాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాము.

**యస్.బాబూరావు, కావలి.**

# ఈ నరకం ఇంకెన్నాళ్ళు



"ఈ నగరానికి ఏమైంది... ఓ పక్క మసి... మరోపక్క పొగ... నిర్లక్ష్యానికి చెల్లించక తప్పదు భారీ మూల్యం"... థియేటర్లలో గాని, టీవీలలో గాని సినిమా ప్రదర్శనకు ముందు వచ్చే ప్రకటన ఇది. ఇప్పుడు నెల్లూరు పరిస్థితి కూడా అలాగే వుంది. ఓ పక్క మసి... ఇంకో పక్క పొగ అన్నట్లుగా మారింది భూగర్భడ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల పుణ్యమా అని!

నెల్లూరు నగరంలో 1100కోట్ల ఖర్చుతో భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌ల పనులు ముమ్మరంగా జరుగుతుండడం తెలిసిందే! గత ప్రభుత్వాలలో వందలకోట్ల వ్యయంతో వేసిన సిమెంట్, తారురోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. ఏ రోడ్డు కూడా ఇప్పుడు శుభ్రంగా లేదు. ఏ రోడ్డులోనూ వాహనాలు సక్రమంగా వెళ్ళే పరిస్థితి లేదు. తవ్వేసిన రోడ్ల మూలంగా వాహనదారులు నరకం చూస్తున్నారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తవ్విన రోడ్లు ఓ పక్క ఇబ్బంది పెడుతుంటే, తవ్విన చోట పూడ్చడానికి పై లేయర్‌గా చేస్తున్న బ్లాక్‌పౌడర్(డస్ట్) జనానికి సినిమా చూపిస్తోంది. మినీబైపాస్, మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డుతో పాటు నగరంలో పలు రోడ్లపై ఈ బ్లాక్‌పౌడర్‌నే వేశారు. వాహనాలు వెళ్ళినప్పుడు ఈ దుమ్ము మేఘాలు మాదిరిగా వీస్తుంది. ఈ దుమ్ము ముక్కుల్లోకి పోతే అనారోగ్య సమస్యలు తలెత్తకమానవు. బ్లాక్‌పౌడర్‌తో లేనిపోని అనర్ధాలు తలెత్తుతున్నాయి. ఆ రోడ్లో వెళ్ళే ద్విచక్రవాహనదారులు గాని, ఏ.సిలు వేసి వాహనాలలో ప్రయాణించేవాళ్ళు గాని, పాదచారులుగాని ఈ డస్ట్‌ను పీల్చక తప్పనిపరిస్థితి. ఎంతసేపని ముక్కులు మూసుకుని ఊపిరి బిగపట్టి ఉండగలరు? ఈ రోడ్లమీద గట్టిగా కిలోమీటరు దూరం నడిచినా, బండి మీద వెళ్ళినా అరకిలో డస్ట్ నెత్తిన, ముఖాన వుంటుంది. ఈ డస్ట్‌లో పోలీసులకు కూడా ట్రాఫిక్ విధులు నిర్వహించడం కష్టంగా ఉంటుంది. వాళ్ళూ మనుషులే కదా! రోగాలకు వాళ్ళేం అతీతులు కాదుకదా! ఈ డస్ట్ దెబ్బకు ప్రధాన రోడ్ల పక్కనవున్న భవనాలు దుమ్ము పేరుకుపోయి, కొత్తగా పెయింట్‌లు వేసుకోవాల్సిన పరిస్థితి. తవ్విన గుంతలను పూడ్చడానికి కనీసం గ్రావెల్ వాడున్నా ఇంత ఇబ్బంది ఉండేది కాదు. లేదా పౌడర్‌తో పాటు సన్న చిప్స్ వేసున్నా ఈ దుమ్ము బాధ ఇంత వుండేది కాదేమో? ఏదైనా తవ్విన రోడ్లను తొందరగా వేస్తే ఈ డస్ట్ బాధల నుండి నగర ప్రజలకు మోక్షం కల్పించినవాళ్ళవుతారు!



# పేటలో పోటీకెవరు?



- 'దేశం'కు అభ్యర్ధి సమస్య

జిల్లాలో తెలుగుదేశంపార్టీకి గట్టి నియోజకవర్గాలలో సూళ్ళూరుపేట ఒకటి. ఇది ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం అయినప్పటికి ఇంతకాలంగా వేనాటి సోదరులే ఇక్కడ పార్టీని నడుపుతూ వచ్చారు. అభ్యర్థులను నిర్ణయిస్తూ, గెలిపిస్తూ వచ్చారు. తెలుగుదేశం ఆవిర్భవించాక ఇప్పటివరకు 8సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే, 5సార్లు తెలుగుదేశం అభ్యర్థులే గెలిచారు. 1989, 2004లలో మాత్రం కాంగ్రెస్, 2014 ఎన్నికల్లో మాత్రం వైయస్సార్‌కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించింది. 1994 ఎన్నికల నుండి కూడా ప్రతి ఎన్నికల్లో పరసా రత్నమే ఇక్కడ పార్టీ అభ్యర్థిగా వుంటున్నాడు. వేనాటి సోదరులే అతనిని పార్టీలోకి తీసుకొచ్చి ఆయన తరపున పని చేస్తున్నారు.

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు ఒక లెఖ్ఖ! ఇక జరగబోయే ఎన్నికలు ఒక లెఖ్ఖ! 2014 ఎన్నికల వరకు కూడా ఈ నియోజకవర్గంలో పార్టీ పెత్తనమంతా కూడా వేనాటి కుటుంబం చేతిలో వుంటూ వచ్చింది. కాని ఈ నాలుగేళ్లలో ఇక్కడ రాజకీయంగా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. పార్టీలో వ్యాపారవేత్త గంగా ప్రసాద్‌కు ప్రాధాన్యత పెరిగింది. వేనాటికి విరోధిగా వున్న ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డిని పార్టీలోకి తీసుకున్నారు. వేనాటి ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేసారు. పార్టీ పెట్టాక గత 3దశాబ్దాలలో ఎప్పుడూ చవిచూడని చేదు అనుభవాలను వేనాటి కుటుంబం ఈ మూడేళ్ళలోనే చూసారు. ఇంకోపక్క పార్టీ ఇన్‌ఛార్జ్‌గా వున్న పరసా రత్నం అంటే కూడా వేనాటికి ఇష్టం లేదు. ఇదే సమయంలో సూళ్ళూరుపేట ఎమ్మెల్యేగా వున్న కిలివేటి సంజీవయ్యకు ప్రజల్లో మంచి పేరొచ్చింది. ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికి ప్రజల్లో బాగానే తిరుగుతున్నాడు. ప్రజల కష్టనష్టాలు తెలుసుకుంటున్నాడు. నియోజకవర్గంలోనూ సంజీవయ్య స్ట్రాంగ్‌క్యాండిడేట్ అనే ప్రచారం వచ్చింది. ఈ నేపథ్యంలో అతనికి పోటీకి పరసా రత్నం పనికిరాడని, కొత్త అభ్యర్థిని తెరమీదకు తేవొచ్చనే వూహాగానాలున్నాయి. వేనాటి కొత్త అభ్యర్థి వైపే మొగ్గు చూపొచ్చని తెలుస్తోంది.

# ధర తగ్గిస్తే దండన తప్పదు

## రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రైతులకు ప్రభుత్వం నిర్ధేశించిన కనీస మద్దతుధరను తగ్గించి ధాన్యం కొనుగోలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 4న ఆయన నెల్లూరులోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ ఏడాది సుమారు 8 లక్షల ఎకరాల్లో సాగుచేయడం ద్వారా 30 లక్షల పుట్లకు పైగా ధాన్యం సేకరణ చేసేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో 40వేల టన్నులపైన గోదాముల్లో భద్రపరచుకునే అవకాశం ఉందని అంటూ, నాణ్యత గల ధాన్యానికి కనీస మద్దతు ధర పుట్టికి 13,515రూపాయలు, సాధారణ రకం ధాన్యానికి 13,175 వంతున చెల్లించడం జరుగుతుందన్నారు. ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ నూటికి నూరుశాతం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ, జిల్లాలో 162 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సుధాభారతి, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఉపేంద్రతో పాటు రైతు సంఘం నాయకులు, లారీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# పరచుకుంటున్న పచ్చదనం

## నగరంలో పార్కులకు మంచిరోజులు

పాతికేళ్ళ క్రితం నెల్లూరు నగరంలో "పార్కు" అంటే గాంధీ బొమ్మ వద్ద స్వతంత్ర పార్కు ఒక్కటే కనిపించేది. ఆ పార్కులో చెట్ల క్రిందే జనాలు సేద తీరుతూ, జాతీయ, అంతర్జాతీయ రాజకీయ ముచ్చట్లు పెట్టుకుని వుండేవాళ్ళు. తిక్కన పార్కు, గుప్తాపార్కు వంటివి వున్నా వాటిని పెద్దగా అభివృద్ధి చేసింది లేదు. 2000 ప్రాంతంలో అప్పటి కలెక్టర్ శ్రీలక్ష్మి చొరవతో ప్రముఖ దాత జె.యస్.రెడ్డి దాతృత్వంతో చింతారెడ్డిపాలెంరోడ్డులో నగరానికే శోభాయమానంగా చిల్డ్రన్స్ పార్క్ వెలసింది. అయితే ఆ తర్వాత వచ్చిన కలెక్టర్ అనంతరాము దానిని వ్యాపారం కోసం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి నాశనం చేసి పెట్టారు.

నగరంలో పలు చోట్ల పార్కుల కోసం రిజర్వు స్థలాలు ఉంచినా వాటిని పార్కులుగా అభివృద్ధి చేసింది లేదు. మాగుంట లే అవుట్‌లో కేకేఆర్ గౌతమ్ స్కూల్ ఎదురుగా మాగుంట సుబ్బరామ రెడ్డి మెమోరియల్ పార్కును అప్పట్లో స్థానికులే అభివృద్ధి చేసుకోవడం జరిగింది. అయ్యప్పగుడి, బాలాజీనగర్‌లలో పార్కు స్థలాలలోనే పోలీసు స్టేషన్‌లు కట్టడం చూసాం.

వాస్తవంగా లే అవుట్లు వేసిన రియల్టర్లే పార్కుల కోసం



చిల్డ్రన్స్ పార్క్



శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి స్మారక ఉద్యానవనం

వదిలిన స్థలాలలో పార్కులను అభివృద్ధి చేయాలి. కాని, వాళ్ళు రిజర్వు స్థలాలు వదలడం తప్పించి, అభివృద్ధి చేసేవాళ్ళు కాదు. మున్సిపాల్టీవాళ్ళు కూడా వీటిని పట్టించుకోకపోవడం వల్ల చాలాచోట్ల రిజర్వ్ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి.

అయితే గత నాలుగేళ్లలో నగరంలో ఇతర విభాగాలలో జరిగిన అభివృద్ధిని పక్కనపెడితే పార్కులకు మాత్రం మంచికాలమే వచ్చిందని చెప్పవచ్చు. మున్సిపల్ మంత్రి పి.నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల నిరుపయోగంగా వున్న ఎన్నో రిజర్వ్‌స్థలాలు పార్కులుగా రూపాంతరం చెందాయి, చెందుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'అమృత్' పథకం ద్వారానైతేనేమీ, స్థానిక దాతల సహకారంతోనైతేనేమీ, కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలోని సివిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో గాని నగరంలో చాలా పార్కులకు పచ్చని కళ వచ్చింది. ఎంతో అందంగా ఈ పార్కులు తయారవుతున్నాయి. నెల్లూరీయులకు ఆహ్లాదాన్ని ఆనందాన్ని అందించబోతున్నాయి.



### • ట్రాఫిక్ మార్పులు...

# కొంత మేలు... కొంత ఇబ్బంది

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్నయినా పూర్తిగా తుడిచిపెట్టొచ్చేమోగాని నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను ఒక దారికి తేవడం మాత్రం ఎవరి వల్లా అయ్యే పనికాదు. ఏ ఎస్పీకైనా నెల్లూరులో పెద్ద సవాల్ ట్రాఫిక్కే! కొందరు ఎస్పీలు మాకెందుకొచ్చిన తలనొప్పిలే అని దాని గురించే పట్టించుకోరు. ఇంకొందరు జనం అవస్థలు చూడలేక కొంతన్నా సరి దిద్దాలనే ప్రయత్నం చేస్తారు. ప్రస్తుత ఎస్పీ రామకృష్ణ అదే ప్రయత్నం చేస్తున్నారు.



కెవిఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్లు

రోడ్లు ఎలాగూ పెంచలేరు. వాహనాలను తగ్గించలేరు. కనీసం కొన్ని మార్పులతో ట్రాఫిక్‌ను సరిదిద్దాలనుకున్నారు. ఇందులో భాగంగానే కె.వి.ఆర్ పెట్రోల్ బంకు వద్ద వున్న జంక్షన్‌ను మూసి వేయించి అటూ ఇటూ కొంచెం దూరంలో సిండికేట్ బ్యాంకు వద్ద, కస్తూరిదేవి స్కూల్ వద్ద వాహనాలు మలుపులు తిరిగేలా డివైడర్లు ఏర్పాటు చేయించారు. దీనివల్ల జంక్షన్‌లో రోడ్డు దాటడం కోసం ఒక్కో రోడ్డులో వాహనాలను ఆపేసి ఇంకో రోడ్డులో వాహనాలను పంపే పరిస్థితి ఉండదు. ఇక్కడ మలుపు తిరిగి ఎటువైపు వెళ్ళే వాహనాలు అటు వెళ్లొచ్చు. ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరం లేని పద్ధతి ఇది. కాక పోతే మలుపు తిరిగే చోట రోడ్డును ఇంకా వెడల్పు చేయాలి. దాని వల్ల నేరుగా వచ్చే వాహనాలకు మలుపు తిరుగుతున్న వాహనాలతో ఇబ్బంది వుండదు. మలుపు తిరిగే చోట రోడ్డు ఇరుకు వల్ల యధాతథంగా ట్రాఫిక్‌జాం అవుతుంది. గాంధీ బొమ్మ, రామలింగాపురం జంక్షన్‌ల వద్ద కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. వాహనాలు మలుపు తిరిగే చోట రోడ్డు వెడల్పు చేసి మలుపు తిరిగే వాహనాలకు, అలాగే నేరుగా వచ్చే వాహనాలకు విడివిడి లైన్‌లు కేటాయిస్తే ఈ విధానం విజయవంతమవుతుంది.

# పొద్దుపోయినా ఆగని గ్రీవెన్స్



ప్రతి సోమవారం నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు శాఖ తరపున ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహిస్తుండడం తెలిసిందే! ఎస్పీ రామకృష్ణ గ్రీవెన్స్ డేలో స్వయంగా పాల్గొంటూ బాధితుల సమస్యలు వింటుండడమే కాక వెనువెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఎంత పొద్దుపోయినా బాధితులందరి సమస్యలు విని, వారి అర్జీలు పరిశీలించాకే ఆయన ఆరోజు గ్రీవెన్స్ డేను ముగిస్తున్నారు. ఒక్కోరోజు బాగా చీకటిపడి రాత్రి పది, పదకొండు గంటలైతే తన సొంత డబ్బులతోనే తోటి సిబ్బందికి భోజనం, టిఫిన్‌లు తెప్పించి పని చేయిస్తున్నారు. ఆయన నిజాయితీని చూసి సహచర సిబ్బంది కూడా ఆయనకు నచ్చినట్లుగా పని చేస్తున్నారు.

# బ్రిడ్జి నిర్మించి... ప్రాణాలు కాపాడండి

**- ప్రభుత్వానికి మాగుంట శరత్ యువజన సేవాసమితి వినతి**




నెల్లూరు నగరంలోని చింతారెడ్డిపాళెం హైవే రహదారిపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి కోరుతోంది. ఈ ప్రాంతంలో హైవే దాటుతూ హైవే అవతల ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారంటూ సేవాసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల ఆ సేవాసమితి ఆధ్వర్యంలో బాధిత గ్రామాల ప్రజలతో కలసి ఆమేరకు ఆందోళన నిర్వహించారు కూడా. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యుడు దారా మహేష్ మాట్లాడుతూ, ఈ హైవే రహదారి అవతల 10 గ్రామాలకు పైగానే ఉన్నాయని, ఆ గ్రామాల్లో వారు రోజువారీ పనుల నిమిత్తం నిత్యం హైవే రహదారిని దాటాల్సివస్తోందన్నారు. హైవే దాటుతున్న సందర్భంగా జరిగే ప్రమాదాల్లో పలువురు ప్రమాదాలకు గురై మరణించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైవే అవతల ప్రముఖ ఆసుపత్రి సింహపురి హాస్పిటల్ కూడా ఉందని, చింతారెడ్డిపాళెంలో పాలిటెక్నిక్ కళాశాలకు నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని, హైవే దాటాల్సిరావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఈ ఇబ్బందులన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఇక్కడ బ్రిడ్జిని నిర్మించాలని సేవాసమితి సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సుజనమ్మ, రజనమ్మ, సరస్వతమ్మ, చంద్రమ్మ, నాని, మనోజ్, శ్రీకాంత్, గిరీష్, శ్రీవాన్ తదితరులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# వినోదం బంద్

దక్షిణ భారత చలనచిత్ర ఐక్య కార్యాచరణ కమిటి నిరసనలతో నెల్లూరు జిల్లాలో ఈనెల 2వతేదీ నుండి సినిమా హాళ్ళు మూతపడ్డాయి. సిపిఎఫ్ ఛార్జీలు క్రమంగా ఎత్తివేయాలని, విరామ సమయంలో ప్రదర్శించే ప్రకటనలను సినిమా పరిశ్రమకు ఇవ్వాలని ఇలా పలు డిమాండ్లతో యాజమాన్యాలు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా జిల్లాలోని 70 సినిమా థియేటర్లు మూతపడ్డాయి. ఈ నెల 4వ తేదీ ఆదివారం కావడం, థియేటర్లు లేకపోవడంతో సినీ ప్రేక్షకులు కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రలకు ప్రాధాన్యం ఇచ్చారు. మైపాడు, కొత్తకోడూరు బీచ్‌లకు, పార్కులకు వెళ్ళి కాలక్షేపం చేశారు. ఈ మూడురోజులకుగాను రూ. 1.50కోట్ల మేర నష్టం వచ్చినట్లు డిస్ట్రిబ్యూటర్లు పేర్కొంటున్నారు.

# నెల్లూరు కబుర్లు

## ఢిల్లీలో వాళ్ళు... అమరావతిలో వీళ్ళు

రాష్ట్ర శాసన సభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 5వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరి, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా ప్రతిపక్ష వైకాపా శాసనసభ సమావేశాలను బహిష్కరించడం తెలిసిందే! దీంతో నెల్లూరు జిల్లాకు చెందిన వైకాపా ఎమ్మెల్యేలు ఆరుమంది కూడా ఢిల్లీకి చేరి ప్రత్యేక హోదా ఉద్యమాలలో పాల్గొంటున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యే పాశం సునీల్‌తో పాటు తెలుగుదేశం ఎమ్మెల్యేలు ముగ్గురు, ఇద్దరు మంత్రులు, ఇద్దరు ఎమ్మెల్సీలు అమరావతిలో వుంటూ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్నారు.

## పరీక్షలు... పెళ్ళిళ్ళు

ఓ పక్క ఇంటర్మీడియట్ పరీక్షలు... ఇంకోపక్క పెళ్ళిళ్ళు... నెల్లూరు ఎంతో సందడిగా వుంది. ఉదయం 8గంటల నుండే నగరంలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రుల హడావిడి కనిపిస్తోంది. సొంత వాహనాలతో పాటు కాలేజీల బస్సులు, టౌన్‌బస్సులు, ఆటోలు నిండుగా నడుస్తున్నాయి. ఇంకోపక్క పెద్ద కళ్యాణ మండపాలలోనే కాదు, చిన్నచిన్న కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌లో కూడా వివాహాలు, రిసెప్షన్‌లు పెద్దఎత్తున జరుగుతున్నాయి. పెళ్ళిళ్ళకు వచ్చే వాహనాలతో నగరమంతా ట్రాఫిక్‌మయం అవుతోంది.

## మళ్ళీ హెల్మెట్ ప్రయోగం




ఎందుకనో గాని నెల్లూరుజిల్లాలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ప్రయోగం విఫలమవుతూనే వుంది. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్న నిబంధనను గతంలో ఎన్నోసార్లు అమలు చేసారు. దీని కోసం మోటార్ వాహనాల షోరూమ్‌లలో హెల్మెట్‌ల అమ్మకాలు కూడా పెట్టారు. బండితో పాటు హెల్మెట్ కొనాలనే నిబంధన తెచ్చారు. హెల్మెట్ లేని వాహనదారులకు పోలీసులు జరిమానాలు కూడా విధించారు. అయితే దానిని నిరంతరాయంగా అమలు చేయలేకపోయారు. కొద్దిరోజులు మాత్రమే ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌లు పెట్టుకున్నారు. తర్వాత యధాపరిస్థితే!

కాగా, రవాణాశాఖాధికారులు మరోసారి హెల్మెట్ సబ్జెక్ట్‌ను తెరమీదకు తెచ్చారు. ఈ నెల 20వ తేదీ నుండి పెట్రోల్ బంకుల వద్ద హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారులకు పెట్రోల్ పోయరంట. 'నో హెల్మెట్ - నో పెట్రోల్' నినాదాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తామని, ప్రజల్లో దీనిపై అవగాహన కల్పిస్తామని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ శివరాంప్రసాద్ చెబుతున్నారు. ఈ మేరకు ఆయన పెట్రోల్ బంకు ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో కూడా మాట్లాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవడానికి హెల్మెట్ వాడకం మంచిదే! ప్రజలు, ద్విచక్రవాహనదారులు కూడా దీనికి సహకరిస్తే బాగుంటుంది.

## మైథిలీస్కూల్ వార్షికోత్సవం


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

నెల్లూరులోని చంద్రమౌళినగర్‌లో ఉన్న మైథిలీస్కూల్ 27వ వార్షికోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆ పాఠశాలవారు స్థానిక ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా 28వ వార్డు కౌన్సిలర్ మేకల రజని, 29వ వార్డు కౌన్సిలర్ రాజానాయుడు, పాఠశాల వ్యవస్థాపకులు మైథిలి మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీమతి మైథిలి, పాఠశాల డైరెక్టర్ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. మేకల రజని జ్యోతిని వెలిగించి విద్యార్థులకు ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో భాగంగా 100 మీటర్ల రన్నింగ్‌రేస్, లాంగ్‌జంప్, బాల్‌త్రోయింగ్, కబడ్డీ, ఖోఖో తదితర ఆటలను నిర్వహించడంతో స్టేడియం ప్రాంగణమంతా సందడిగా మారింది. పాఠశాల డైరెక్టర్ రాధాకృష్ణమూర్తితో పాటు, ఉపాధ్యాయులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు ఈ వార్షికోత్సవంలో పాల్గొన్నారు.



## ఢిల్లీ వీధుల్లో...

# హోదాపై గళమెత్తిన నెల్లూరు నేతలు!

ప్రత్యేకహోదా పోరాటంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుండి పెద్దసంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలు ఢిల్లీ చేరుకోవడం జరిగింది. నెల్లూరుజిల్లా వైకాపా నాయకులు కూడా దండిగానే ఢిల్లీకి వెళ్లారు. 5వ తేదీ ఢిల్లీలో నిర్వహించిన మహాధర్నాలో నెల్లూరు జిల్లాకు సంబంధించి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైకాపా రాజ్యసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, నాయకులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళి, పి.రూప్‌కుమార్‌యాదవ్, పేర్నేటి శ్యాం, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, వేనాటి సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# దళిత కాలనీలకు చంద్రన్న కాంతులు

### - మంత్రి నారాయణ



పొర్లుకట్టలోని ఎస్సీ కాలనీలో పనులను పరిశీలిస్తున్న మంత్రి పి.నారాయణ

ఎంతోకాలం నుంచి అభివృద్ధికి నోచుకోని ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో కొత్తవెలుగులు ప్రసరింపజేయడం, ఈ కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేసి సుందరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని పురపాలక శాఖ మంత్రి డా.పి.నారాయణ అన్నారు. ఈ నెల 3న ఆయన నెల్లూరు నగరంలోని 11, 13 డివిజన్లలో రోడ్లు, డ్రైన్లు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనంతగా ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ కింద రాష్ట్ర ప్రభుత్వం 19వేల కోట్లు కేటాయించిందని, జిల్లాలో 111 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రోడ్లలో సెంటర్ డివైడర్ల గోడలకు రంగులు వేసి సుందరీకరించిన నగరపాలక సంస్థ కమిషనర్‌ను మంత్రి అభినందించారు. త్వరలో సిఎస్‌ఆర్ నిధులతో రెండు రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్‌ను అందించే కార్యక్రమానికి శంకుస్థాపన చేయనున్నామన్నారు. నెల్లూరులోని స్వర్ణాల చెరువు అభివృద్ధి పనులను నుడా సంస్థకు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ స్కూళ్ళలో సిఎస్‌ఆర్ నిధులతో 70వేల బెంచీలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఆలీంబాషా, తహశీల్దారు నరసింహులు, కార్పొరేటర్లు షంషుద్దీన్, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రూరల్‌ని సస్యశ్యామలం చేస్తా

### - ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని టీడీపీ నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరురూరల్ ఏరియాలోని 32వ డివిజన్ పరిధి అంబాపురం అరుంధతీయవాడలో ఈ నెల 4న జరిగిన దళిత తేజం కార్యక్రమంలో ఆదాల పాల్గొని మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని దళితవాడల్లో ఆగస్టు, సెప్టెంబర్‌లోగా సి.సి.రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు. నెలరోజుల్లో అన్ని గ్రామ పంచాయితీల్లో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, హరిబాబుయాదవ్, ఏసునాయుడు, మాతంగి కృష్ణ, ఝాన్సీ, లక్ష్మి, శైలేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.




# ఉత్తరక్రియలు

మా ఇంటి దీపం, మా పెద్దదిక్కు

## కోడూరు శకుంతలమ్మ గారు

(లేట్ వెంకటకృష్ణారెడ్డి గారి సతీమణి, పూడిపర్తి గ్రామం, వెంకటాచలం మండలం)

తే 25.02.2018ది ఆదివారం పరమపదించినారు.

వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

- కుటుంబసభ్యులు

### ఉత్తరక్రియలు

వారి పెద్దకర్మ తే.15.03.2018ది గురువారం ఉదయం 10.30గంటలకు నెల్లూరు అరవిందనగర్ ఎక్స్‌టెన్షన్, మాగుంట లే అవుట్‌లోని కౌసల్య నిలయం అపార్ట్‌మెంట్స్ నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# ఎన్‌బికెఆర్‌లో ముగిసిన శిక్షణా తరగతులు

నెల్లూరుజిల్లా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో "టెక్నోట్రాన్ ఎలక్ట్రానిక్ సొల్యూషన్" వారి సహకారంతో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పిసిబి డిజైన్ అండ్ ఫాబ్రికేషన్‌పై నిర్వహించిన శిక్షణా తరగతులు ఈ నెల 6న ముగిసాయి. ఈ శిబిరంలో విద్యార్థులకు సర్క్యూట్‌ను పిసిబి బోర్డుపై నిర్మించే క్రమాన్ని, ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ టూల్‌ను ఉపయోగించి లే అవుట్‌ను బోర్డుపై ముద్రించే విధానం, కనెక్షన్స్‌లోని లోపాలను గుర్తించే విధానం గురించి వివరించారు. కార్యక్రమ సమన్వయకర్త డా॥ జి.కామేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులకు పిసిబి డిజైన్, ఫాబ్రికేషన్‌లు ద్వితీయ సంవత్సరంలోనే పరిచయం చేయడం ద్వారా స్వయంగా చివరి సంవత్సరంలోని ప్రాజెక్టులు చేసుకోగలరని వివరించారు. ఇసిఇ విభాగాధిపతి డా॥ జి.హరినాధరెడ్డి మాట్లాడుతూ పిసిబి డిజైన్, ఫాబ్రికేషన్ అనేది ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రాథమిక అంశం అన్నారు. ప్రతి విద్యార్థి దానిని నేర్చుకోవాలని సూచించారు. కళాశాల సంచాలకులు డా॥ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు థీరీటికల్, ప్రాక్టికల్ నాలెడ్జ్ గడించి ఇండస్ట్రీలకు అవసరమయ్యే అర్హతలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

## 'పూర్ణా'యుష్మతో...

# కన్నుమూసిన కోట సుబ్రహ్మణ్యం



నెల్లూరులో పూర్ణా బిస్కెట్లు, పూర్ణా కేక్స్ పేరు విననివారు ఉండరు. అంతేకాదు, పూర్ణా హోటల్, పూర్ణా కేక్స్ అన్నీ కూడా ప్రసిద్ధమైనవే. నోరూరించే పూర్ణా రుచులు అందరికీ తెలిసినవే. వీటన్నిటికీ ఆద్యుడు పూర్ణాహోటల్ అధినేత కోట సుబ్రహ్మణ్యం.

1946లో వ్యాపారరీత్యా కొత్తకోడూరు నుంచి కేవలం 2వేల రూపాయల పెట్టుబడితో నెల్లూరులో బిస్కెట్ల వ్యాపారం చేయాలని వచ్చి 'పూర్ణా' పేరిట పలు వ్యాపారాలు నిర్వహించి ఆ రంగంలో అంచలంచెలుగా ఎంతో ఎత్తుకు ఎదిగారాయన. సుమారు ఆరు దశాబ్దాలకు పైగా పలు వ్యాపారాల్లో పట్టు సాధించి ఆయా రంగాల్లో అగ్రగామిగా నిలిచిన కోట సుబ్రహ్మణ్యం 1918 మార్చి 27న జన్మించారు. 2018 మార్చి 3వ తేది శనివారం ఉదయం నెల్లూరు కొండాయపాళెం రోడ్డు, స్టీల్‌ఫ్యాక్టరీ సెంటర్‌లోని తన స్వగృహంలో నిండు నూరేళ్ళ వసంతంలో అడుగిడి పూర్ణాయుష్షుతో కన్నుమూశారు. ఆయన మరణం ఆయన కుటుంబసభ్యులను శోకసంద్రంలో ముంచింది. గత ఏడాది సెప్టెంబర్ 3వ తేదీన ఆయన సతీమణి శ్రీమతి జయమ్మ మృతి చెందారు. ఆమె 90 ఏళ్ళ వయసులో పరమపదించారు. సతీవియోగం తట్టుకోలేని సుబ్రహ్మణ్యం ఆమె పరమపదించిన ఆరు నెలలకే కన్నుమూశారు. తొలుత కేరళ వారితో కలసి న్యూ మలబార్ బేకరి ప్రారంభించి అనతికాలంలోనే పలు సొంతవ్యాపారాలు చేసి పూర్ణా ఉత్పత్తులను, మధుర స్వీట్స్, పూర్ణ హోటల్స్, మధుర లాడ్జి తదితరాల ద్వారా పేరుగడించి తన వ్యాపారరంగం ద్వారా వేలాదిమందికి ఉపాధి కల్పించిన వ్యాపారవేత్త ఆయన. నెల్లూరులోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో క్యాంటీన్‌లు, స్టాల్స్ నిర్వహించడమే కాక, ఇప్పటికీ తద్వారా అనేక కుటుంబాలవారికి ఉపాధి కల్పించి ఆ రంగంలో ఆదర్శప్రాయునిగా నిలిచారు. ఒకవైపు తన వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూనే కోట సుబ్రహ్మణ్యం సమాజానికి తనవంతు సేవలు చేయడం విశేషం. అనేక సామాజిక, ధార్మిక సేవలకుగాను ఆయన అనేక గుప్తదానాలు చేశారు. స్టీల్‌ఫ్యాక్టరీ సెంటర్‌లో ఆయన నిర్మించిన శ్రీ సిద్ధి వినాయకస్వామి దేవాలయం నేటికీ భక్తులందరికీ కొంగుబంగారంగా అలరారుతోంది. జయభారత్ వైద్యశాల సహకారంతో ఆయన 20 ఏళ్ళ క్రితమే ప్రారంభించిన ఉచితవైద్య సేవా శిబిరం క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం వందలాది మంది రోగులకు ఉపయోగపడుతోంది. కోట సుబ్రహ్మణ్యంకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. తండ్రి నెలకొల్పిన వ్యాపార రంగాలను కుమారులు ప్రభాకర్‌రావు, సుధాకర్‌రావు, గోపీకృష్ణలు, ఇతర కుటుంబసభ్యులు కొనసాగిస్తూ తండ్రి ఆశయసాధనలో నిరంతర కృషిచేస్తున్నారు. కేవలం వ్యాపారాభివృద్ధికే కాక, సమాజానికి తనవంతు సేవలు చేసి పూర్ణాయుష్షుతో కన్నుమూసిన కోట సుబ్రహ్మణ్యం ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది 'లాయర్'.

## కాలధర్మం

# కోడూరు శకుంతలమ్మ



వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రామానికి చెందిన స్వర్గీయ కోడూరు వెంకటకృష్ణారెడ్డి సతీమణి శ్రీమతి కోడూరు శకుంతలమ్మ ఫిబ్రవరి 25వ తేదీన స్వర్గస్తురాలైనారు. ఆమె వయస్సు 88సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పూడిపర్తి గ్రామంలో పేరుమోసిన రైతు కుటుంబం వారిది. గత కొన్నేళ్ళుగా నెల్లూరు, లెక్చరర్స్ కాలనీ, అరవిందనగర్ ఎక్స్‌టెన్షన్‌లో నివాసముంటున్నారు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



సమావేశంలో మాట్లాడుతున్న వై.చలపతిరావు, పక్కన రామ్మోహన్‌రావు, శివకుమార్ తదితరులు

## గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య

# యువజన విభాగ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గూడూరు శాఖ అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు అధ్యక్షతన యువజన శాఖ ఏర్పాటు కార్యక్రమం గూడూరు ఎన్‌జివో భవనంలో ఈ నెల 4వ తేదీ ఉదయం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చలపతిరావు యువజన విభాగ ఆవశ్యకతను తెలియజేస్తూ కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయించారు. అతిత్వరలో బ్రాహ్మణ భవన్ ఏర్పాటు పూర్తి కావస్తుందని, మహిళా – అర్చక విభాగాల ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ నూతన యువజన కార్యవర్గాన్ని అభినందిస్తూ రాబోయే రోజుల్లో మంచి కార్యక్రమాలు చేయాలని ఉద్బోధించారు. పై కార్యక్రమంలో నాదబ్రహ్మం, చిట్టమూరు శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్, పురుషోత్తం, కడివేటి రామమూర్తి, డి.బాలశ్రీనివాస్, లలితమ్మ, కడివేటి పద్మజ, నిర్మల, నాగమణి, నూతనంగా ఎన్నికైన యువజన విభాగ అధ్యక్షులు కె.బాలసుందరశర్మ, కార్యదర్శి కాశీవిశ్వేశ్వరశర్మ, కోశాధికారి వంగర బాలాజీ, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# శతమానం భవతి...

## డాక్టర్ సి.ఆర్.రెడ్డి 90వ జన్మదిన వేడుకలు

గూడూరు సాయినగర్‌లో వున్న సాయిబాబా మందిరంలో ఈ నెల 2వ తేదీ డాక్టర్ సి.ఆర్.రెడ్డి 90వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ ఆడిటర్, గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు, వారి సతీమణి రాజ్యలక్ష్మి డాక్టర్ సి.ఆర్.రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విద్య, వైద్య వృత్తిలో ఆయన ఎనలేని సేవలు అందించారన్నారు. ముఖ్యంగా బాలికల కోసం డిఆర్‌డబ్ల్యూ కళాశాల స్థాపించి సుమారు 1500మంది విద్యార్థినులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.రోహిణి, ఎన్.కోటేశ్వరరావు, జనార్ధన్, కరుణాకర్‌రెడ్డి, సాయి సేవకులు తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర జేఏసి వైస్‌ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్, రిటైర్డ్ ఉద్యోగులు డాక్టర్ సి.ఆర్.రెడ్డిని ఆయన ఇంటిలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు.



డాక్టర్ సి.ఆర్.రెడ్డిని సన్మానిస్తున్న శ్రీకంటి రామ్మోహన్‌రావు, రాజ్యలక్ష్మి, డాక్టర్ సి.రోహిణి

# సమస్యలు పరిష్కరించేలా చర్యలు



ఆర్డీవో అరుణ్‌బాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అరుణ్‌బాబుకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోతో కలసి గ్రీవెన్స్‌డేలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజల సమస్యలు తొలగించేలా చేయాలని ఆర్డీవోని కోరారు. కాగా, చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు ముత్యాలమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అరుణ్‌బాబు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ముత్యాలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు కోర్టును పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి

గూడూరు కోర్టును ఈనెల 4వతేదీ హైకోర్టు న్యాయమూర్తి ఏ.రామలింగేశ్వర రావు పరిశీలించారు. ఆయనకు న్యాయమూర్తులు, న్యాయవాదులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేలూరు గోపికృష్ణ మాట్లాడుతూ న్యాయవాదులకు కోర్టు ప్రాంగణంలో షెల్టరు లేదని, గతంలో ఉన్న షెల్టర్‌ను కోర్టుకి వినియోగిస్తున్నారని తెలిపారు. దీంతో పాటు తాత్కాలిక క్యాంటిన్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలన్నారు. ఆయన వెంట జిల్లా జడ్జి మౌలానాజూనైద్ అహ్మద్, ప్రోటోకాల్ జడ్జి కేశవ, ఏడవ అదనపు జిల్లా జడ్జి శాంతి, సీనియర్ సివిల్‌జడ్జి రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి జయలక్ష్మి, అడిషనల్ ఫస్ట్‌క్లాస్ జడ్జి లావణ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది గోపికృష్ణ

# ప్రధాని కుర్చీలో చంద్రబాబు

గల్పిక

ఉండవల్లిలోని హైటెక్‌రత్న, ఆంధ్ర సీఎం చంద్రబాబు నివాసం. కేంద్రమంత్రులు అశోక గజపతిరాజు, సుజనాచౌదరి, ఎంపీలు గల్లా జయదేవ్, రాయపాటి సాంబశివరావు, కేశినేని నాని, ఎన్.శివప్రసాద్, మురళీమోహన్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమలు వున్నారు. అశోక గజపతిరాజు వుండి... సార్, కేంద్రం వైఖరి ఏమీ బాగాలేదు. ఏపి నాయకులను వెర్రోళ్ళలాగా చూస్తున్నారు. మీరు చెబితే ఇప్పుడే రాజీనామా చేసేస్తామన్నాడు. ఆ మాటకు సుజనాచౌదరి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. వెంటనే ఆయన... చేస్తావ్ చేస్తావ్ నీదేం పోతుంది... నీకేమయ్యా మీ ఊర్లో బ్యాంకులో నీకు లక్ష కూడా అప్పుండదు. అవతల బ్యాంకుల్లో మాకు వేలకోట్ల అప్పులున్నాయి. కేంద్రం నుండి ఇప్పుడు బయటకొస్తే మీకు పోయేదేమీ లేదు... నన్ను తీసుకుపోతారు. భలే వాడివే... కేంద్రంతో పేచీ వద్దు. ఎలక్షన్ దాకా మాకు న్యాయం చేయమని మోడీని బ్రతిమలాడుకుందాం, ఎలక్షన్ తర్వాత రిజల్ట్‌ను బట్టి ప్లేటు మారుద్దాం అని ప్రతిపాదించాడు. అప్పుడు సోమిరెడ్డి అందుకుని... ఆ బీజేపీవాళ్ళకు మనమంటే లెక్కలేకుండా పోయింది. మన చంద్రబాబు గారిని వాళ్ళు ఇంత వరకు ఒక సైడే చూసారు. ఇప్పుడు రెండో సైడ్ చూసే టైం వచ్చింది. జాతీయ రాజకీయాలలో మన చంద్రబాబు గారు ఇక చక్రం తిప్పాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పాడు. చంద్రబాబు గారు జాతీయ రాజకీయాలపై దృష్టి సారిస్తే ఏపిలో పార్టీ పరిస్థితి ఏంటని మురళీమోహన్ సందేహం వెలిబుచ్చాడు. అందుకు నారాయణ స్పందిస్తూ... ఉన్నాడుగా నా శిష్యుడు లోకేష్. జయంతిని వర్ధంతిగా మార్చిన ఘనాపాటి. అమెరికాలోనూ తెలుగుదేశాన్ని అధికారంలోకి తీసుకురాగల ధీశాలి. అలాంటి ధీరుడు, వీరుడు ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశాన్ని అధికారంలోకి తీసుకురాలేడా... ఏం భయం లేదు సార్, మీరు నిశ్చింతగా ఢిల్లీ వెళ్ళండి, ఇక్కడంతా లోకేష్ సారథ్యంలో మేం చూసుకుంటామని చెప్పాడు. ఆ మాటలతో చంద్రబాబు గాలి కొట్టిన బెలూన్‌లా ఉబ్బిపోయాడు. అయినా తమాయించుకుని వారితో... జాతీయ రాజకీయాలలోకి మనంతట మనంగా ప్రవేశిస్తే మన కాళ్ళు మనమే పిసుక్కున్నంత చీప్‌గా ఉంటుంది. సిచ్యుయేషన్ మనల్ని డిమాండ్ చేయాలి. దేశంలోని కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలన్నీ కూడా... ఈ మోడీని తట్టుకోలేకపోతున్నాం, ఆ పప్పు(రాహుల్)ను నమ్మలేకున్నాం... మీరే మాకు దిక్కు... జాతీయ రాజకీయాలలోకి రండి అని మన కాళ్ళకు మొక్కాలి. అప్పుడు ఎంట్రీ ఇస్తే అదిరిపోతుంది అని చెప్పాడు. అందుకు వెంటనే శివప్రసాద్... ఆరోజు త్వరలో వస్తుంది బాబూ, త్వరలో మీరు ప్రధాని అవుతారు బాబూ అని చెప్పాడు. టైం కోసం వెయిట్ చేద్దాం అని చంద్రబాబు చెప్పడంతో ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. చంద్రబాబు స్నానం చేసి మనుమడు దేవాన్ష్‌తో కలిసి రెండు పుల్కాలు తిని తన బెడ్ మీద నడుం వాల్చాడు.

★★★★★

ఏవండీ... లేవండీ అని తనను తట్టడంతో చంద్రబాబు ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా తన శ్రీమతి భువనేశ్వరీదేవి... ఏంటని చంద్రబాబు అడిగాడు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఫోన్ చేసిందండి... మీతో అర్జంట్‌గా మాట్లాడాలంట అని చెప్పింది. చంద్రబాబు ఆమె చేతిలో వున్న ఫోన్ తీసుకుని హలో అన్నాడు. అవతల నుండి మమత... చంద్రబాబు గారు... నరేంద్ర మోడీ దూకుడుకు కళ్లెం వేయాలంటే మీరు జాతీయ రాజకీయాలలోకి రావాలి. వాళ్ళు ఒక్కో రాష్ట్రాన్ని కబళించుకుంటూ వస్తున్నారు. నెక్స్ నా స్టేట్‌కు టార్గెట్ పెట్టారు. వాళ్ళు నా రాష్ట్రం మీదకు రాకముందే వాళ్ళనే సెంట్రల్‌లో లేకుండా చేయాలి. అది మీ వల్లే సాధ్యమవుతుంది అని చెప్పింది. చంద్రబాబు ఆమెతో... టైమొస్తే తప్పకుండా వస్తానమ్మా అని చెప్పి ఫోన్ పెట్టేసాడు. ఆయన అలా ఫోన్ పెట్టాడోలేదో... మళ్ళీ రింగయ్యింది. చంద్రబాబు ఫోన్ ఎత్తాడు. అవతల నుండి ఒరిస్సా సీఎం నవీన్ పట్నాయక్... చంద్రబాబు గారు, మీరు అర్జంట్‌గా జాతీయ రాజకీయాల్లోకి రావాలి, మీరు రాకుంటే నేను మీ ఇంటి ఎదుట నిరాహారదీక్షకైనా కూర్చుంటాను. ఆ బీజేపీ వాళ్ళు నా ఒరిస్సాను కబళించాలని చూస్తున్నారు. వాళ్ళ నుండి మమ్మల్ని మీరే కాపాడాలని ప్రాధేయపడ్డాడు. అలాగే... మీకు తప్పకుండా సాయం చేస్తానని చంద్రబాబు ఫోన్ పెట్టేసాడు. అప్పుడే ల్యాండ్ ఫోన్ రింగయ్యింది. ఫోన్ ఎత్తాడు. అవతల నుండి... చంద్రబాబు... నేను లాలూను, బీహార్ జైలు నుండి మాట్లాడుతున్నా... నువ్వు ఢిల్లీ రాజకీయాల్లోకి రావాలబ్బా... లేకుంటే ఈ బీజేపీ వాళ్ళతో కష్టం అని అడిగాడు. చంద్రబాబు అలాగే అంటూ ఫోన్ పెట్టేసాడు. అప్పుడే దేవాన్ష్ లోపలకు వచ్చి... తాతయ్య మీ కోసం... ములాయం సింగ్ యాదవ్ తాతయ్య, సీతారాం ఏచూరి మావయ్యా, మాయావతి అత్తయ్య, ప్రకాశ్ కారత్ అంకుల్ వచ్చారు. బయట హాల్‌లో వున్నారు అని చెప్పాడు. ఈ టైంలో వీళ్ళంతా కట్టకట్టుకుని ఎందుకు వచ్చారబ్బా అనుకుంటూ చంద్రబాబు హాల్‌లోకి వెళ్ళాడు. బాబును చూడగానే వాళ్ళంతా లేచి నమస్కరించారు. ఏం ఇలావచ్చారని చంద్రబాబు అడిగాడు. బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా తృతీయ ఫ్రంట్ నిర్మాణం జరగాలి. దానికి మీరే సారధ్యం వహించాలి. ఫ్రంట్ అధికారంలోకి వస్తే ప్రధానమంత్రి కూడా మీరే అని ములాయం అన్నాడు. సీతారాం ఏచూరి వుండి... మాకు మొన్న బెంగాల్ పోయింది, నిన్న త్రిపుర పోయింది... మీరు తృతీయ ఫ్రంట్‌ను పెట్టకపోతే రేపు కేరళ కూడా పోతుంది. మా కోసమన్నా మీరు జాతీయ రాజకీయాల్లోకి రావాలి అని చేతులు పట్టుకున్నాడు. అలాగే వస్తాను అంటూ చంద్రబాబు వారిని పంపించేసాడు. వాళ్ళు వెళ్ళాక ఆయన బిగ్గరగా నవ్వుతూ... సిచ్యుయేషన్ నన్ను డిమాండ్ చేస్తుంది. ఇక నేషనల్ పోలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇస్తాను అని అరవసాగాడు. అప్పుడే ఏవండీ... ఏవండీ... అని ఎవరో తనను పిలవడం వినిపించింది. ఇంతకుముందే కదా నన్నలా పిలిచి తట్టి లేపింది... మళ్ళీ ఇంతలోనే ఇలా పిలుస్తున్నదెవరు అని మనసులో అనుకుంటుండగానే ముఖాన ఫోర్స్‌గా నీళ్ళు పడ్డాయి. ఆ దెబ్బతో అదిరిపోయి చంద్రబాబు కళ్ళు తెరిచాడు. ఎదురుగా భువనేశ్వరి... అంటే ఇప్పటిదాకా వచ్చింది కలన్నమాట... అని తనకు తాను తెలుసుకున్నాడు. తర్వాత తేరుకుని ఎందుకు లేపావ్ అని తన శ్రీమతిని అడిగాడు. ఆమె టీవీ ఆన్ చేసి 9×9=99 ఛానెల్ పెట్టి ఈ న్యూస్ చూడండి అంటూ వెళ్ళిపోయింది. స్క్రీన్‌పై న్యూస్ రీడర్ న్యూస్ చదువుతోంది. జాతీయ రాజకీయాల్లోకి వస్తానన్న కేసీఆర్... తృతీయ ఫ్రంట్‌కు తానే సారధ్యం వహిస్తానని వెల్లడి. చంద్రబాబును కూడా కలుపుకుపోతానని చెప్పిన కేసీఆర్... కేసీఆర్‌కు ఫోన్ చేసి మద్దతు తెలిపిన మమత, వామపక్షాల నేతలు.. ఈ న్యూస్‌ను వినగానే చంద్రబాబు తల వెయ్యికిలోమీటర్ల వేగంతో తిరగసాగింది.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బిడ్డల విద్యా వివాహ విషయాలలో ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనాలి. వస్తువులు, డబ్బు భద్రపరచుకొనడం చేయండి. ఆర్థికంగా బాగుండినా స్థిమితంగా ఉండలేరు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగి ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ఖర్చులు అధికం కాగలవు. కుటుంబ విషయాలపై దృష్టిపెడతారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. గిట్టనివారి వల్ల మాటలు పడవలసి ఉంటుంది. ఇంట బయట పనులందు శ్రమ ఉంటుంది. కాని చేపట్టిన పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. పబ్లిక్‌లో మంచి పేరు ప్రతిష్టలు పొందుతారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

యజమానులకు వర్కర్ల వల్ల ఇబ్బందులుండును. ఉద్యోగులకు అధికారుల అనుకూలత ఉంటుంది. రావలసిన బాకీలు కొంత అందుతాయి. దైవ, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాల ప్రయత్నాలు జరుగుతాయి. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అయినా అవసరాలకు కొద్ది ఋణాలు చేయక తప్పదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆరోగ్యం ఫరవాలేదు. శుభకార్యాలలోను, దైవ కార్యాలలోను పాల్గొంటారు. సోదర వర్గానికి మంచి జరుగుతుంది. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ప్రయాణాలుంటాయి. కమిటి సమావేశాలలో ప్రముఖ పాత్ర వహిస్తారు. ఉన్నత విద్యావకాశాలుంటాయి. ఇతరులకు ధన వస్తు మాట రూపంలో సహాయం చేస్తారు. పట్టుదలతో అనుకున్న పనులు జరుపుకొంటారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

సాంకేతిక, న్యాయ, వైద్య రంగాల వారికి ఆర్థికావకాశాలు బాగుంటాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు పొందుతారు. ఒకటి రెండు పెద్ద అనవసర ఖర్చులుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ముఖ్య విషయాలపై నిర్ణయాలు తీసుకొనలేక టెన్షన్ పడతారు. పెండింగ్ సమస్యలు పరిష్కారం కాగలవు. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. ఆదాయం పెరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలిసివస్తాయి. దైవ, సామాజిక సేవా కార్యక్రమాలకు సహాయపడతారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. వ్యాపారులు, అధికారులకు ప్రభుత్వ సంబంధమైన ఇబ్బందులు కలుగవచ్చు. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగములలో గాని, ఇతర కార్యక్రమములలోగాని నిర్వహణ సామర్థ్యము బాగుంటుంది. ఆత్మీయులను కలుస్తారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 9.3.2018 నుండి
తేది. 15.3.2018 వరకు

ఈ వారం కర్కాటకంలో రాహువు, తులలో గురువు, ధనుస్సులో శని కుజులు, మకరంలో కేతువు, కుంభంలో రవి, 14తేది నుండి మీనంలో రవి, మీనంలో బుధ శుక్రులు, వృశ్చిక ధనుర్మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము

ముహూర్తములు లేవు.

### ఫాల్గుణ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 9 | శుక్ర | అష్టమి | పూర్తిగ |
| తేది. 10 | శని | అష్టమి | ఉ॥ గం.7.0వ॥ |
| తేది. 11 | ఆది | నవమి | ఉ॥ గం.9.0వ॥ |
| తేది. 12 | సోమ | దశమి | ఉ॥ గం.11.06వ॥ |
| తేది. 13 | మంగళ | ఏకాదశి | ప॥ గం. 1.10వ॥ |
| తేది. 14 | బుధ | ద్వాదశి | ప॥ గం.3.04వ॥ |
| తేది. 15 | గురు | త్రయోదశి | సా॥ గం.4.36వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

గృహ మార్పులు, స్థానమార్పులుండగలవు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. హామీలు, మధ్యవర్తిత్వాలకు పోవద్దు. పిల్లల వల్ల ఖర్చులు ఉంటాయి. ఇబ్బందులుండినా ధైర్యంగానే ఉంటారు. ఉద్యోగులకు విధినిర్వహణ సాఫీగా సాగిపోతుంది. దైవకార్యాలలో పాల్గొంటారు. ఆర్థిక ఇబ్బందులుండవచ్చును. ఖర్చులు అధికంగా ఉంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్యం సంతృప్తికరం. అధికారులకు స్థానమార్పు, పెండింగ్ పనులు పరిష్కారం కాకపోవుట, ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అవసరాలకు డబ్బు సమకూర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు జరగకపోయినా ఆదాయ లోపం కలగదు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉన్నత విద్యపై అనిశ్చితి ఉంటుంది. నిరుద్యోగులకు అవకాశాలు దొరకడం, దైవ సేవా కార్యములలో పాల్గొనడం, సహాయం చేయడం జరుగుతుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. విలువైన వస్తువులను సమకూర్చుకొంటారు. ఆర్థిక ఒప్పందాలు జరుగును. వృత్తి జీవనం కలవారికి మంచి అవకాశాలు దొరుకుతాయి., వ్యాపార వర్గాలకు ఆదాయం బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

విలువైన వస్తువులు సమకూర్చుకొనడం, శుభకార్యములను నిర్వహించడం జరుగుతుంది. దూరప్రయాణాలుండును. రాజకీయ వర్గాలు సామరస్యంగా పోవడం మంచిది. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగావకాశాలు లభించగలవు. వ్యాపారాలు లాభసాటిగా జరుగుతాయి. కొత్త పెట్టుబడులకు కొత్త వ్యాపారాలకు అవకాశాలుంటాయి. ఆస్థి క్రయవిక్రయాల అగ్రిమెంట్లు జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపార రంగాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. కుటుంబసభ్యులకు కొద్దిపాటి అనారోగ్య బాధలుంటాయి. విలువైన వస్తువులు సమకూరుతాయి. దైవ సేవా సామాజిక రంగాలకు సహాయం చేయడం చేస్తారు. స్థిరాస్తులు, షేర్ల మీద లాభాలుంటాయి. పనులు సానుకూలంగా జరిగినా టెన్షన్ ఉంటుంది. మీ ఆరోగ్యం ఫరవాలేదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆర్థికంగా బలపడి వృత్తి వ్యాపారాలు అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది. తొందరపాటు ప్రవర్తన, మాటలు అదుపులో పెట్టుకొనాలి. బిడ్డలకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. బంధు మిత్రులను, ప్రముఖులను కలుసుకొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. శుభకార్యముల తేదీలను నిర్ణయం చేస్తారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

# కల్యాణ వైభవం...!



నెల్లూరుజిల్లాలో రాజకీయంగా పేరుమోసిన బెజవాడ కుటుంబీకులు బెజవాడ దశరథరామిరెడ్డి - అన్నపూర్ణల మనుమడు, ప్రగతి ఆగ్రో బయోప్రోడక్ట్స్ వ్యవస్థాపకుడు బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి - ప్రత్యూషల కుమారుడు **శరణ్‌రామ్ - నిఖిత** (బెంగుళూరు వాస్తవ్యులు పోయిపట్ల శ్రీనివాస హర్షవర్ధన్‌రెడ్డి - మమతల కుమార్తె)ల కళ్యాణం ఈ నెల 1వ తేదీ బెంగుళూరులో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.



నెల్లూరు మాగుంట లే అవుట్ వాస్తవ్యులు ఎం.శ్రీధర్‌రెడ్డి - రమాదేవిల కుమార్తె **శ్రీజ - చందన్** (చెంచురెడ్డి - ఉదయల కుమారుడు)ల వివాహం ఈ నెల 8వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.



ప్రఖ్యాత శాస్త్రవేత్త డా. అనుమకొండ జగదీష్ - వైదర్భిదేవిల కుమార్తె **స్రవంతి - ఫణికుమార్** (విశాఖపట్నం వాస్తవ్యులు బొల్లం వెంకట అప్పారావు - రామ వైదేహిల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 3వ తేదీ నెల్లూరులోని హోటల్ మినర్వా గ్రాండ్ నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని స్వామి రిలాక్స్ ప్యారడైజ్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ మహిళా జర్నలిస్ట్ పాపానాయుడుపేట యాసిన్‌ను సత్కరిస్తున్న కృష్ణతేజ గ్రూప్ అధినేత శ్రీమతి చదలవాడ సుచరిత, బీజేపీ నాయకులు కోలా ఆనంద్ తదితరులు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి వైభవంగా పుష్పయాగం



నెల్లూరు దర్గామిట్టలో వేంచేసియున్న భక్తుల కొంగుబంగారం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి ఈ నెల 6న రాత్రి పుష్ప యాగం వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగి 43 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2009 నుంచి పెంచలరెడ్డి రాజరాజేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారికి పుష్ప యాగం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష అభిషేకాలు, పూలంగి సేవ, విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధా కృష్ణశర్మ ఆధ్వర్యంలో గోపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో సహస్ర నామార్చన మధ్య పుష్ప యాగాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహించారు. వివిధ ఆలయాలకు చెందిన వేద పండితులచే నాలుగు వేదాల పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వేగూరు రవీంద్రరెడ్డి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఓడూరు సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్నందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నెల్లూరుజిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. నెల్లూరు ప్రెస్‌క్లబ్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి అనుముల జయప్రకాష్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వల్లూరు వెంకటేశ్వర్లు, ఎం.వి.చంద్రశేఖర్‌లు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరశింహులు, ఎన్.దేవ కుమార్, ప్రింట్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, జర్నలిస్టులు మనుబోలు ప్రభాకర్‌రావు, బాబి, ప్రేమ్ చంద్, దామోదర్, రఘురామ్, ఆనంద్, రవికృష్ణారెడ్డి, మాటేటి రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!



ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు శిష్యుడు నందిమండలం చంద్రశేఖర్‌రాజు - వసుంధరదేవిల కుమారుడు **డాక్టర్ యశ్వంత్ - డాక్టర్ శృతి** (డాక్టర్ జంపాన వెంకటేశ్వరరావు - డాక్టర్ అనూరాధల కుమార్తె)ల పరిణయం ఫిబ్రవరి 24వ తేదీ సికింద్రాబాద్‌లో జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



ప్రముఖ సంగీత విద్వాంసురాలు దుర్భా రాజ్యలక్ష్మి - జనార్ధనంల కుమార్తె **సాయిమహతి - వెంకట శ్రీనివాస్**(విశాఖ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ గరిమెళ్ళ నరసింహ సోమయాజులు - ఇందిరల కుమారుడు)ల పెళ్ళి ఈ నెల 3వ తేదీ నెల్లూరులోని ఏఎల్‌రావు కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' అభినందనలు.



కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు మాజీసభ్యులు బడబాగ్ని ఆంజనేయరాజు - లక్ష్మీదేవిల కుమారుడు **పవన్‌కుమార్‌రాజు - లక్ష్మీసాయిప్రత్యూష** (వినుకొండ సత్యనారాయణరాజు - హేమలతల కుమార్తె)ల వివాహం ఈ నెల 1వ తేదీ గుంటూరులోని శ్రీరస్తు కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## బాధితులకు బాసటగా సీఎం సహాయనిధి

**- బీద మస్తాన్‌రావు**



అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరి, అప్పులు చేసి వైద్యం చేయించుకుని ఎన్నో ఇబ్బందులు పడుతున్న బాధితులకు చేయూతగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందుతోందని రాజధాని నిర్మాణ సలహాకమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు అన్నారు. ఈనెల 4న కావలి టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రతిపాదనలు పంపిన 13 మందికి 10,22,240 రూపాయల చెక్కులను అందజేశారు. ఇప్పటివరకు 302 మందికి మొత్తం 2,36,44,084 రూపాయలు కావలి నియోజకవర్గంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీచేశారన్నారు. ఎవరికైనా ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వర్తించనివారు, తమ బిల్లులతో తనను సంప్రదించి సిఎం సహాయనిధి నుంచి సాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కావలి వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మెన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి ఆలేఖ్య, పట్టణ టిడిపి అధ్యక్షుడు అమరా వేదగిరిగుప్తా, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, కోసూరి వెంకటేశ్వర్లు, షేక్ ఖమర్‌బాబు, డి. దేవకుమార్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా రంగడి రథోత్సవం



నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైన తల్పగిరి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 25వ తేదీ నుండి అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. 26న ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహనం, 27న ఉదయం సూర్యప్రభ, రాత్రి హంస వాహనం, 28న ఉదయం సింహవాహనం, రాత్రి చంద్ర ప్రభ ఉత్సవం, ఈ నెల 1న ఉదయం పల్లకీ, రాత్రి హనుమంత సేవ, 2న ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం పూలంగి సేవ, రాత్రి బంగారు గరుడసేవ, 3న సాయంత్రం పూలంగిసేవ, రాత్రి కళ్యాణోత్సవం తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధా నార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిషింద సుదర్శనాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 4వ తేదీ ఆదివారం ఉదయం నిర్వహించిన రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. విశేషంగా అలంకరించిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన రంగనాథస్వామిని దర్శించుకునేందుకు భక్తులు నగరం నుండే కాకుండా జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చారు. భక్తులు రంగనాథునికి కర్పూరహారతులు ఇచ్చి, టెంకాయలు కొట్టి విశేషపూజలు నిర్వహించారు. రథ చక్రాలపై సంప్రదాయంలో భాగంగా ఉప్పు, మిరియాలు చల్లుతూ స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 9.10గంటలకు ప్రారంభమైన రథోత్సవం భక్తులు శ్రీరంగ... జైరంగా అంటూ జయజయ ధ్వానాలు చేస్తుండగా... మధ్యాహ్నం 12.10గంటలకు ముగిసింది. తొలుత తూర్పువైపున ఉన్న రాజ గోపురం నుంచి ప్రారంభమైన రథోత్సవం గోపురం వీధి, రంగనాయకులపేట రైల్వేగేటు మీదుగా తిరిగి రంగనాయకుల పేట, సంతపేట, నాలుగుకాళ్ళ మండపం వరకు సాగింది. తొలుత రథోత్సవానికి ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి రామ లింగేశ్వరరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్అహ్మద్ మౌలానా, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ గుమ్మడికాయతో దిష్టి తీసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రంగనాథ స్వామి ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకరరావు, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, నరశింహస్వామి ఆలయ ఛైర్మెన్ మల్లినేని వెంకటేశ్వర రావు, ఇ.ఓ ఎ.వి.శ్రీనివాసులురెడ్డి, శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఆల్లూరు గిరీష్‌రెడ్డి, నగర డిఎస్పీ మురళీ కృష్ణ, కార్పొరేటర్లు రూప్‌కుమార్‌యాదవ్, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, ఆనం విజయ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వచ్ఛంధ సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు.



గుమ్మడికాయ దిష్టి తీసి రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి రామలింగేశ్వరరావు

# 11న 'ఉగాది' పురస్కారాలు

శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని గుండాల లక్ష్మమ్మ-నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదిన ఆయారంగాల్లో విశేష కృషి చేస్తూ విశిష్ట సేవలందిస్తున్న పలువురికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ కవి గుండాల నరేంద్రబాబు తెలియజేశారు. స్థానిక దర్గామిట్టలోని సాంఘిక సంక్షేమశాఖ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఆరోజు ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విక్రమసింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.వీరయ్య, పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, పద్య సారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, ప్రిన్సిపాల్ పానుగోటి దేవసహాయం చేతులమీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారని తెలిపారు. ప్రముఖ నవలా రచయిత్రి శ్రీమతి ఎన్.పూజిత, ప్రఖ్యాత యోగ శిక్షకురాలు, 'యోగరత్న' శ్రీమతి జెకె స్వప్న, ప్రముఖ పద్యకవి రాపూరు వెంకయ్య, ఎన్‌బికెఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులు.. ఆచార్య టి.మాలకొండయ్య, ప్రముఖ కవి..'లాయర్' వారపత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు, ప్రముఖ కవి మోపూరు పెంచలనరసింహం, ప్రముఖ జానపద గాయకుడు కె. ఓబులేశులకు ఈ విశిష్ట పురస్కారాలు ప్రదానం చేయనున్నామని, సాహిత్యాభిమానులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వైకాపాదే పైచేయి!

(మొదటి పేజీ తరువాయి)

కిరాతకంగా వ్యవహరిస్తున్నాడు. ప్రత్యేకహోదాను పక్కన పెట్టేసి ప్రత్యేకప్యాకేజీతో సరి పెట్టుకోమన్నాడు. చంద్రబాబు ప్రత్యేకహోదా ఇస్తే నాకేమొస్తుంది, ప్రత్యేకప్యాకేజీయే నాకు చాలన్నాడు. ప్రత్యేకహోదా అంశాన్ని బీజేపీ, టీడీపీలు పూర్తిగా పూడ్చి పెట్టాలని చూసాయి. కాని, గత నాలుగేళ్ళుగా ప్రత్యేకహోదాపై పోరాడింది వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డే! రాష్ట్ర మంతటా ప్రత్యేకహోదాపై జగన్ సభలు పెట్టాడు, నిరాహారదీక్ష చేసాడు, ఆందోళనలు చేపట్టాడు. వామపక్షాలు కొంతవరకు అతనికి మద్దతుగా నిలిచాయి. ప్రత్యేకహోదాకై పోరు అంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారం అప్పుడప్పుడూ బయటకొచ్చినా ప్రజలపై ప్రభావం పెద్దగా లేదు. ఈ రాష్ట్రంలో ప్రత్యేకహోదా ఉద్యమాన్ని సజీవంగా నిలబెట్టింది జగనే. ఇప్పుడు దాని సెగలు ఢిల్లీని తాకేలా చేసింది కూడా జగనే! ఎన్డీఏ ప్రభుత్వం చివరి సంవత్సరంలో కూడా ప్రత్యేకహోదా గురించి ఆలోచించక పోవడం, బడ్జెట్‌లో ఏపికి తీరని అన్యాయం చేయడంతో జగన్ పోరు తీవ్రతను పెంచాడు. ప్రత్యేకహోదా సాధన దిశగా పోరాటం ముమ్మరం చేశాడు. పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను తీవ్రం చేయడంతో పాటు పోరాటాన్ని ఢిల్లీ వీధుల్లోకి తీసుకెళ్ళాడు. వైకాపా ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన మహాధర్నాకు జాతీయ స్థాయిలో అన్ని పార్టీల వారు మద్దతు ప్రకటించారు. హోదా పోరాటంలో ఇంకో అడుగు ముందుకేసి వైకాపా ఎంపీల చేత రాజీనామా చేయించేందుకు సిద్ధంగా ఉన్నాడు. జగన్ హోదా పోరును ఉధృతం చేయడం వల్లే తెలుగుదేశం పార్టీకి ఏమీ పాలుపోని పరిస్థితి వచ్చి బీజేపీతో చెడింది. రేపటి రాజకీయాలలో గెలుపెవరిదో, ఓటమి ఎవరిదో చెప్పలేం... కాని, ఈ రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలని గట్టిగా పట్టు బట్టింది జగన్ అయితే, దీనిని కేసులకు భయపడి కేంద్రానికి తాకట్టుపెట్టింది మాత్రం చంద్రబాబే! రాష్ట్ర ప్రజల దృష్టిలోనే కాదు, తెలుగుదేశం కార్యకర్తలు కూడా ఈ విషయంలో చంద్రబాబు కంటే జగన్‌నే సమర్ధిస్తున్నారు. హోదా పోరును జగన్ వేగవంతం చేసాకే అందరిలోనూ కదలిక వచ్చింది. ఢిల్లీలో దీనిపై కాక రగిలింది.

# జగన్ జోరు.. బాబు బేజారు

(మొదటి పేజీ తరువాయి)

డ్రామాలాడుతున్నారన్న విషయం ప్రజలకు అర్ధమైపోయింది. జగన్ ప్రత్యేకహోదా ఉద్యమాన్ని డైవర్ట్ చేయడం కోసం మధ్యలో జేఏసీ పేరుతో పవన్ కళ్యాణ్‌ను పంపిం చినా అది సక్సెస్ కాలేదు. ప్రత్యేక హోదా ఉద్యమం ఢిల్లీ స్థాయికి చేరకుండా, రాష్ట్రంలో చప్పబడిపోయుంటే చంద్రబాబు బీజేపీతో ఎలాంటి పేచీలు పెట్టుకుని వుండేవాడు కాదు. కేంద్ర కేబినెట్ నుండి మంత్రులను బయటకు రప్పించేవాడూ కాదు. ఎందుకంటే కేంద్రం ప్రత్యేకహోదా లేదు ప్రత్యేకప్యాకేజీ ఇస్తామన్నప్పుడు చప్పట్లు కొట్టి స్వాగతించింది చంద్రబాబే! ఆ ప్రత్యేకప్యాకేజీ క్రిందే వాళ్ళు నిధులిస్తు న్నారు. ఇచ్చిన నిధులకు లెక్కలు అడుగు తున్నారు. ఇచ్చిన నిధులకు లెక్కలు సమర్పిస్తే మళ్ళీ నిధులు ఇస్తామంటున్నారు. కాని కేంద్రం ఇచ్చిన నిధులకు చంద్రబాబు వద్ద లెక్కలు లేవు. ఆ నిధులన్నింటిని చంద్రబాబు ప్రభుత్వం తమ ఆర్భాటాల కోసం మళ్ళించింది. వాళ్ళకు లెక్కలు చెప్పాలంటే ఇక్కడ బొక్కలు బయట పడతాయి. ఈ లెక్కలు ఇవ్వకనే కేంద్రంతో నిధుల పేచీ వచ్చింది. ప్రత్యేకప్యాకేజీ చంద్రబాబు ఒప్పుకున్న సబ్జెక్ట్ కాబట్టి దీనిని సాకుగా చూపి ఆయన కేంద్ర కేబినెట్ నుండి బయటకు రావాల్సిన పనిలేదు.

కేవలం ప్రత్యేకహోదా పోరు క్రెడిట్ అంతా కూడా జగన్ తన్నుకుపోతున్నాడని, తాను ప్రజల దృష్టిలో విలన్‌ను అవుతున్నానని గమనించే చంద్రబాబు ఈ మంత్రుల ఉపసంహరణ అంశానికి తెరతీసాడు. అప్పటికీ బీజేపీతో పూర్తిగా తెగదెంపులు చేసుకోలేదు. ఓ పక్క కేంద్ర ఆర్ధికమంత్రి అరుణ్‌జైట్లీ అవసరం వున్నా లేకున్నా ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని ఖరాఖండీగా చెబుతున్నాడు. చంద్రబాబు మంత్రులు కేబినెట్ నుండి వైదొలిగినంత మాత్రాన కేంద్రంలో కదలిక వచ్చి ప్రత్యేకహోదా ఇస్తామని ముందుకొచ్చేదేమీ లేదు. కాబట్టి బీజేపీతో పూర్తిగా తెగదెంపులు చేసుకోవచ్చు. కాని, చంద్రబాబు ఆ సాహసం చేయలేకపోతున్నాడు. ఎందుకంటే మెడపై ఓటు-నోటు కత్తి వేలాడుతోంది. దానిని మళ్ళీ కోర్టు మెట్లెక్కించారంటే చంద్రబాబు పరువు, ప్రతిష్ట పాతాళానికి పోతాయి.

జగన్ దెబ్బకు తట్టుకోలేకే మంత్రులనన్నా ఉపసంహరింపజేసాడు. జగన్ అసలు ఉద్యమమే చేయకుంటే చంద్రబాబుకు అసలు ఈ సమస్యలన్నీ ఉండేవి కావు. కేంద్రం ఇచ్చినవి తీసుకుంటూ, ఆ దేశం ఈ దేశం తిరుగుతూ అమరావతి కథలు చెప్పుకుంటూ హాయిగా ఉండేవాడు.

# ఇది తొలి సంతకం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 26వ తేదీన రాష్ట్రంలోని 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో రెండు స్థానాలు తెలుగుదేశం పార్టీకి దక్కే అవకాశం వుండగా, ఒక స్థానం వైకాపాకు దక్కబోతోంది. తమకు దక్కే ఒక్క స్థానానికి వైసిపి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఖరారు చేయడం జరిగింది. ఈమేరకు ఆయన ఈ నెల 7వ తేదీన వైకాపా రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్ యాదవ్, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డిలతో కలిసి వెలగపూడిలోని తాత్కాలిక అసెంబ్లీలో రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణకు 3 సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడం ఇక లాంఛనమే! ఆయనను రాజ్యసభ అభ్యర్థిగా ఎన్నుకోవడానికి వైసిపికి తగిన ఎమ్మెల్యేల సంఖ్యా బలం వుంది. టీడీపీకి ఇద్దరు రాజ్యసభ సభ్యులను ఎన్నుకునే బలం ఉంది. కాబట్టి తెలుగుదేశం ఇద్దరు అభ్యర్థులను మాత్రమే ప్రకటిస్తే ఎలాంటి పోటీ లేకుండా ముగ్గురి ఎన్నిక సాఫీగా జరిగిపోతోంది. చంద్రబాబు దురుద్దేశ్యంతో, తగిన ఎమ్మెల్యేల బలం లేకున్నా మూడో అభ్యర్థిని రంగంలోకి దించితే కొంత టెన్షన్ వుంటుంది కాని... ఈ పరిస్థితులలో వైకాపాను వదలి చంద్రబాబును నమ్మి వెళ్ళే వాళ్లెవరూ ఉండరు. కాబట్టి మూడో అభ్యర్థిని పెట్టకపోతే ఏ ఆటంకం లేకుండా, పెడితే కొద్ది ఆటంకంతోనైనా వేమిరెడ్డి రాజ్యసభలో అడుగుపెట్టడం ఖాయం.

## కాలధర్మం

# పి.వి.రమణారెడ్డి



నెల్లూరు నగరంలో సీనియర్ న్యాయవాది, తన శిష్యరికంలో ఎందరో న్యాయవాదులను తీర్చిదిద్దిన మేధావి పూనూరు వెంకటరమణారెడ్డి ఈ నెల 2వ తేదీన స్వర్గస్థులైనారు. ఆయన వయసు 94 సంవత్సరాలు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. కోవూరులో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన 1950లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1963 నుండి 1973 వరకు ప్రభుత్వ ప్లీడర్‌గా పని చేశారు. దక్షిణమధ్య రైల్వే సిండికేట్ బ్యాంకు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, రాష్ట్ర విద్యుత్ శాఖలలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు. 1952 నుండి 1967 వరకు వర్ధమాన సమాజం కార్యదర్శిగా సేవలందించారు. 1964 నుండి రోటరీ క్లబ్‌లో సభ్యుడిగా వుంటూ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటుండేవారు. అలాగే తిక్కవరపు రామిరెడ్డి కవిత్రయ జయంతి సంఘం సభ్యుడిగాను, దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి వ్యవస్థాపకుడిగాను, విఆర్ విద్యాసంస్థల కోశాధికారిగా, కస్తూరిదేవి విద్యాలయం కమిటి సభ్యులుగా, ఇందిరాభవన్ ట్రస్టీగా ఎన్నో పదవులు సమర్ధవంతంగా నిర్వహించారు. ఆయన వద్ద పనిచేసిన జూనియర్స్ ఎందరో ఈరోజు న్యాయశాఖలో ఉన్నత పదవుల్లోనూ, ప్రముఖ న్యాయవాదులుగానూ రాణిస్తున్నారు. ఆయనలో మరో కోణం కూడా ఉంది. ఆయన రచయిత కూడా! 'వ్యాసపల్లరి', 'వ్యాసలహరి' పేరుతో రెండు పుస్తకాలు వ్రాయడమేకాక ఆయన వ్రాసిన పలు కథనాలు, వ్యాసాలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆలిండియా రేడియోలోనూ ధారావాహికంగా వచ్చేవి. ఆయన మొదటి నుండి కాంగ్రెస్‌పార్టీ సానుభూతిపరుడు. ముఖ్యంగా స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి అత్యంత ఆప్తుడు కూడా! కాంగ్రెస్‌పార్టీకి ఆయనే న్యాయపరమైన సలహాలు, సూచనలు అందిస్తుండేవారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# జన్మ జన్మలకూ శ్రీదేవి నటిగానే పుట్టాలి



## - సుబ్బరామన్న ఆకాంక్ష

**ఎప్పుడూ సంతోష సంరంభాలను అందరికీ పంచుతూ..కళలను, కళాకారులను ఆదరించి అభిమానించి ప్రోత్సహిస్తూ, అందరికీ ఎంతో ఉత్సాహాన్నిస్తూ..అందరూ ఆనందపడుతుంటే తానూ సంతోషిస్తూ.. అటు కళారంగానికి, ఇటు ఎంతోమంది ప్రముఖులకు, ప్రజలకు ఆత్మీయులుగా ఉన్న మన సుబ్బరామన్న, ఇటీవల విషణ్ణవదనంతో కనిపించారు. కేవలం సంతోషాల్లోనే కాక కళాకారుల కష్టాల్లోనూ పాలుపంచుకుంటూ కళాకారుల పట్ల తనకున్న ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు.. రాజ్యసభ సభ్యుడు, కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి(టిఎస్సార్).**



పద్మ'శ్రీ'దేవి సంతాపసభ

ఎప్పుడూ సంతోషంగా ఉండే మన సుబ్బరామన్న..శ్రీదేవి మృతితో విషాదానికి గురయ్యారు. భారతీయ చలనచిత్ర రంగంలో అగ్రనటిగా ప్రఖ్యాతినందుకున్న లెజండరీ నటి శ్రీదేవి మృతి ఆయనను బాగా కలచివేసింది. శ్రీదేవి సంతాప సభను ఎంతో బాధాతప్తహృదయంతో నిర్వహించారు. తెలుగమ్మాయిగా పుట్టి లెజండరీ నటిగా విఖ్యాతి చెందిన అగ్ర నటి శ్రీదేవి మృతి భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటని ఆయన అంటూ, ఆ మహానటితో తనకు, తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వాస్తవానికి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా)వారు హైదరాబాద్‌లో శ్రీదేవి సంతాపసభను నిర్వహించాలనుకుంటున్న తరుణంలో, మన సుబ్బరామన్న ఆ సభను తానే నిర్వహిస్తానంటూ ముందుకొచ్చి... అంతటి బాధలోనూ సభను నిర్వహించి కళాకారుల పట్ల తనకున్న ఆత్మీయతను మరోసారి చాటుకున్నారు. ఈ సందర్భంగా టిఎస్సార్ మాట్లాడుతూ, 'జన్మ జన్మలకూ శ్రీదేవి నటిగానే పుట్టాలి' అని మనసారా ఆకాంక్షించారు. 'అందరూ జన్మిస్తారు.. జీవిస్తారు... మరణిస్తారు. కానీ, కొంత మంది మరణించినా శాశ్వతంగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా జీవి స్తారు. అలాంటి కోవకు చెందిన అగ్రనటి మన శ్రీదేవి.. ఆమె మృతి ప్రతిఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది' అన్నారు. ఈనెల 4న టిఎస్సార్ (టి.సుబ్బరామిరెడ్డి) కళా పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో శ్రీదేవి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవి జ్ఞాపకాలతో తెలుగు చలనచిత్ర పరిశ్రమ మరోసారి తల్లడిల్లిపోయింది. అనేకమంది నటీనటులు, సినీప్రముఖులు ఈ సంతాప సభలో పాల్గొని మహానటి శ్రీదేవితో తమ కున్న అనుబంధాన్ని మరోసారి గుర్తుచేసు కున్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన టిఎస్సార్ మాట్లాడుతూ, భారతదేశం గర్వించదగ్గ గొప్ప నటి శ్రీదేవి అని, ఆమె మరణవార్త దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. శ్రీదేవి మరణంతో దేశం ఒక గొప్ప నటిని కోల్పోయిందన్నారు. భారతీయ చలనచిత్ర రంగంలో శ్రీదేవి కోట్లాదిమంది అభిమానులను సంపాదించు కున్నారని, పలు భాషల్లో ఆమె చిత్రాలు విజయవంతం అయ్యాయని, ఎంతోమంది ప్రేక్షకులు ఆమెను అభిమానించారని అన్నారు. హిందీలో 'చాందినీ'గా ఆమె నటన అత్యద్భుతమన్నారు. తెలుగమ్మా యిగా ఉండి బాలివుడ్‌లో తిరుగులేని కథానాయికగా రాణించడం ఎంతో గొప్ప విషయమన్నారు. శ్రీదేవి సాధారణ నటి కాదని, ఎలాంటి పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోయే ఒక కళా శక్తి స్వరూపిణి అని అన్నారు. శ్రీదేవితో తమ అమ్మాయి పింకీరెడ్డి ఎంతో సన్నిహితంగా ఉండేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటీనటులు కృష్ణంరాజు, జయసుధ, జయ ప్రద, అమల, జీవిత, ప్రముఖ గాయని పి.సుశీల, కవిత, కోట శ్రీనివాసరావు, ఆలీ, పరుచూరి గోపాలకృష్ణ, జగపతి బాబు, శ్రీకాంత్, రాజశేఖర్, బాబు మోహన్, సుమంత్, అల్లు అరవింద్, సి.కల్యాణ్, బివిఎస్ఎస్ ప్రసాద్, రామ్ చరణ్ సతీమణి ఉపాసన, పింకీరెడ్డి తది తరులు పాల్గొని శ్రీదేవి చిత్రానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ గాయని పి.సుశీల మాట్లాడుతూ, దేవ లోకం నుంచి వచ్చిన దేవకన్యలాంటి శ్రీదేవి మనల్ని మైమరపించి, మళ్ళీ దేవ లోకానికే వెళ్ళిపోయిందని ఆవేదనగా అన్నారు. ప్రముఖహీరో కృష్ణంరాజు మాట్లా డుతూ, శ్రీదేవి ప్రతిఒక్కరి హృదయాల్లో నిలిచే ఉంటారని అన్నారు. టిఎస్సార్ కుమార్తె శ్రీమతి పింకీరెడ్డి మాట్లాడుతూ, శ్రీదేవి మరణవార్త విన్న తర్వాత బాధ పడని వారెవరూ ఉండరని, అటు సినిమా రంగం.. ఇటు అశేషప్రజానీకం ఎంతో బాధపడ్డారని అన్నారు. ప్రముఖ తారగా, తెలుగమ్మాయిగా ఆమె ఎంతో సాధించిం దని, జీవితంలో ప్రతిఅడుగు ఒక లక్ష్యంగా చేసుకుని నడిచిందని, ప్రతి పాత్రను ఒక సవాల్‌గా తీసుకుని అద్భుతంగా నటించిం దన్నారు. శ్రీదేవి గొప్పనటి మాత్రమే కాదు, మంచి మాతృమూర్తి కూడా. తనలాగే తన కుమార్తె జాన్వీని కూడా తీర్చిదిద్దాలని శ్రీదేవి అనుకున్నారని ఆమె అన్నారు. తొలుత అందరూ శ్రీదేవికి నివాళులర్పిం చారు. చివరగా...'శ్రీదేవి ఆత్మకు శాంతి కలగాలంటూ' మనసారా ఆ భగవంతుని వేడుకుంటూ సభను ముగించారు... కళాబంధు టిఎస్సార్.





## అసెంబ్లీలో అన్నదాత



ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఈ నెల 8వ తేదీన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రతి బడ్జెట్‌లోనూ రైతు బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెడుతున్నారు. ఈ నేపథ్యంలోనే రైతుబడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి గాను రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అచ్చతెలుగు రైతు వేషధారణతో అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. రైతు బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సు లందుకున్నారు. సహచర మంత్రులు కూడా ఆయన వేషధారణ చూసి మీ శాఖకు మీ గెటప్ సరిగ్గా సరిపో యిందంటూ... కితాబిచ్చారు. తెలుగుదేశం పార్టీ మహిళా ప్రజాప్రతినిధులు సైతం ఆయన రైతు గెటప్‌ను చూసి అభినందించారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com